ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
శనివారం 18-07-2026 పేజీలు : 16

## కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కాటారం డివిజన్ ప్రతినిధి, జులై 17 (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో వివిధ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారిని పుణ్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతిలో 17 , ఏడవ తరగతిలో 6, 8వ తరగతిలో ఒకటి , తొమ్మిదవ తరగతిలో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఎం పి హెచ్ డబ్ల్యు మొదటి సంవత్సరంలో 26 సీట్లు, సిఇసి మొదటి సంవత్సరంలో ఇరవై సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు కేజీబీవీని సంప్రదించాలని ఆమె కోరారు.

# ఘట్‌కేసర్‌లో రేపు సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

## రూ.3.95 కోట్లతో "అందెశ్రీ స్మృతి వనం"కు శంకుస్థాపన

ఘట్‌కేసర్, జూలై 17: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి శనివారం ఘట్‌కేసర్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర కవి అందెశ్రీ జయంతి సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రూ. 3.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అందెశ్రీ స్మృతి వనం కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రాష్ట్ర కవి అందెశ్రీకి నివాళులర్పించి, జయంతి వేడుకల్లో పాల్గొంటారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయండి

**-అల్వాల్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**-రోజువారీ లక్ష్యాలను సమర్థవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు దిశానిర్దేశం**



కుత్బుల్లాపూర్, జూలై 17 (విజన్ ఆంధ్ర): ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను పూర్తి బాధ్యతతో నిర్వహిస్తూ ప్రతి అర్హ ఓటరికి సేవలు అందించాలని ఆదేశించారు.

15 పేజీలో...

# సాగునీరు మా హక్కు సాధించేదాకా పోరాటం చేస్తాం

**- బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**



9 పేజీలో...

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

**– పాపన్నపేటలో విషాద ఛాయలు**

పాపన్నపేట విజన్ ఆంధ్ర జులై 17; జీవనోపాధి కోసం జీవాలను (మేకలు/గొర్రెలు)విక్రయిస్తూ కుటుంబాలను పోషిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఘోర రోడ్డు ప్రమాదంలోమృతిచెందడంతో పాపన్నపేట మండల కేంద్రంలో తీవ్ర విషాదం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన చిన్నకటికే రషీద్ (46), మరెల్లి రాములు (50), చిన్నకటికే గౌస్ గురువారం రాత్రి సుమారు 70 జీవాలను నాలుగు చక్రాల గూడ్స్ వాహనంలో ఎక్కించుకుని హైదరాబాద్‌లోని చంగిచర్ల జీవాల మార్కెట్‌కు బయలుదేరారు.మధ్యలో కీసరగుట్టటోల్‌గేట్సమీపానికి చేరుకున్న అనంతరం డ్రైవర్ రాములుకు నిద్ర రావడంతో వాహనాన్ని రహదారి పక్కన నిలిపారు. అనంతరం రషీద్, రాములు వాహనం ముందు భాగం వద్ద కింద నిద్రించగా, గౌస్ వాహనం లోపలే విశ్రాంతి తీసుకుంటున్నాడు.





ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో అతి వేగంగా వచ్చిన గుర్తుతెలియని లారీ నిలిపి ఉంచిన గూడ్స్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో గూడ్స్ వాహనం ముందుకు దూసుకెళ్లి కింద నిద్రిస్తున్న రషీద్, రాములిపైకి ఎక్కింది. అనంతరం లారీ కూడా వారి మీదుగానే వెళ్లిపోవడంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వాహనం లోపల నిద్రిస్తున్న గౌస్‌కు కాలు విరగడంతో పాటుతీవ్రగాయాలయ్యాయి.ప్రమాదాన్నిగమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి గౌస్‌ను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు, మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. ఈప్రమాదంతోపాపన్నపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. కష్టపడి జీవనోపాధి సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులుఒక్కసారిగా మృతి చెందడంతో గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. స్థానికులుమృతులకునివాళులర్పిస్తూవారికుటుంబాలక ుప్రభుత్వం తగిన ఆర్థికసహాయంఅందించాలనికోరారు.పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని లారీకోసంగాలింపుచర్యలుచేపట్టినట్లు సమాచారం.

# ఆరోగ్యవంతమైన చిన్నారులే దేశ భవిష్యత్తుకు పునాది



బోథ్. జూలై 17. (విజన్ ఆంధ్ర) ఆరోగ్యవంతమైన చిన్నారులే దేశ భవిష్యత్తుకు బలమైన పునాదని వార్డ్ సభ్యులు కట్ట భూమేష్, కార్పె శ్రీనివాస్ లు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ చేతి తొలి ముద్ద కార్యక్రమాన్ని బోథ్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రం-8 లో శుక్రవారం 10వ వార్డు సభ్యులు కట్ట. భూమేష్, 6వ వార్డు సభ్యులు కార్పె శ్రీనివాస్ లు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులకు, చిన్నారుల ఆరోగ్యం, పరిశుభ్రత, సమతుల్య ఆహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టిక ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమని వారు అన్నారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ధనలక్ష్మి, ఏఎన్ఎమ్ శశికళ, ఆశ వర్కర్, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావంలో ప్రత్యామ్నాయ పంటలే రైతులకు భరోసా

చేవెళ్ల, జులై 17 (విజన్ ఆంధ్ర): వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉ ంచుకుని రైతులు తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే, పరిమిత నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని చేవెళ్ల మండల వ్యవసాయ విస్తరణ అధికారి సూచించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ... నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకుంటే సాగు వ్యయాన్ని తగ్గించడంతో పాటు ఆదాయాన్ని కూడా మెరుగుపర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. వర్షాభావ పరిస్థితులకు అనువుగా పెసర, మినుములు, నువ్వులు, సజ్జలు, జొన్న, స్వల్పకాలిక మొక్కజొన్న రకాల సాగు చేపట్టాలని సూచించారు. పరిమిత నీటి వనరులు ఉన్న రైతులు డ్రిప్ నీటిపారుదల ద్వారా బెండకాయ, టమాట, వంకాయ, మిరప, దొండకాయ, బీరకాయ, కాకరకాయ, సొరకాయ, చిక్కుడు, గుమ్మడికాయ వంటి కూరగాయలను సాగు చేసి మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు.

అలాగే కంది, పెసర, కంది, మినుములు, పత్తి, పెసర, మొక్కజొన్న, కంది వంటి అంతర, మిశ్రమ పంటల సాగు వల్ల ఒక పంట దెబ్బతిన్నా మరో పంట ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు వినియోగించడం, వర్షపు నీటిని వ్యవసాయ కుంటల్లో నిల్వ చేయడం, పొలాల్లో గట్లు బలోపేతం చేయడం, మల్చింగ్ చేపట్టడం, ఉదయం లేదా సాయంత్రం వేళల్లోనే నీటిపారుదల నిర్వహించడం ద్వారా నీటిని సమర్థంగా వినియోగించుకోవచ్చని వివరించారు. రైతులు స్థానిక వాతావరణ పరిస్థితులను, వ్యవసాయ శాఖ సూచనలను అనుసరించి పంటలను ఎంపిక చేసుకోవాలని, అవసరమైన సాంకేతిక సలహాల కోసం సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు పంట బీమా పథకాలను వినియోగించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి కోరారు. చివరగా నీటిని ఆదా చేద్దాం.. పంటలను వైవిధ్యపరచుకుందాం.. రైతు ఆదాయాన్ని పెంచుకుందాం అని పిలుపునిచ్చారు.

# ప్లాస్టిక్ రహిత హుస్నాబాద్ లో లక్ష్యానికి ముందడుగు

## స్టీల్ బ్యాంకు వినియోగంతో ప్రజల ఆరోగ్య పరిరక్షణ

## హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్న రాజు

హుస్నాబాద్, జూలై 17: హుస్నాబాద్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్వర్గీయ పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళా స్వశక్తి సంఘాలకు ఉచితంగా అందజేసిన స్టీల్ బ్యాంకు కార్యక్రమానికి నేటితో ఏడాది పూర్తయిందని, నియోజకవర్గంలోని 173 గ్రామాలకు చెందిన 276 వీఓ మహిళా సంఘాలకు 13 రకాల స్టీల్ వస్తువులను మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఉచితంగా అందించారని హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్నరాజు అన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం 7,376 సంఘాలకు చెందిన 80,633 మంది సభ్యులు ఈ స్టీల్ బ్యాంకును వినియోగిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో భాగస్వాములు అవుతున్నారని అందులో భాగంగా మండలంలోని మాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత మాట్లాడుతూ,స్టీల్ బ్యాంకు వినియోగం ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతోందన్నారు. హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్నరాజు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబం చేపట్టిన ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రతి గ్రామంలో స్టీల్



బ్యాంకు వినియోగాన్ని మరింత విస్తరించి, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, వీఓ సీఏ వెన్న శ్రీనివాస్, వీఓ అధ్యక్షురాలు గొల్ల సుజాత, అంగన్‌వాడీ టీచర్ గొల్ల సరోజన, వార్డు సభ్యులు సొల్లు రజనీకాంత్, బత్తుల కవిత, నీరటి వెంకటలక్ష్మి, గ్రూప్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ ఖాసీం బస్తీలో అక్రమ స్క్రాప్ దుకాణం తొలగింపు

బెల్లంపల్లి, జూలై 17 విజన్ ఆంధ్ర బెల్లంపల్లి పట్టణంలోని కాంటా ఏరియాలో మహమ్మద్ ఖాసీం బస్తీలో నిర్వహిస్తున్న అక్రమ స్క్రాప్ దుకాణాన్ని మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. దుకాణం కారణంగా స్థానిక వార్డు ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు రవాణా రాకపోకలకు ఆటంకం ఏర్పడుతున్నట్లు, వర్షాకాలంలో పారిశుధ్య, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటూ స్థానికులు పలుమార్లు మున్సిపాలిటీకి ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులపై స్పందించిన అధికారులు సంబంధిత దుకాణ యజమానికి ముందుగా నోటీసులు జారీ చేశారు. నోటీసుల్లో పేర్కొన్న గడువు ముగియడంతో పోలీసుల సహకారంతో అక్రమ స్క్రాప్ దుకాణాన్ని తొలగించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే అక్రమ స్క్రాప్ దుకాణాలపై మున్సిపాలిటీ కఠిన చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు.

పట్టణంలో గుర్తించిన మరో మూడు అక్రమ స్క్రాప్ దుకాణాలను కూడా త్వరలో తొలగించనున్నట్లు వెల్లడించారు. ప్రజల ఆరోగ్యం,



పారిశుధ్యం, ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఏఈ నిఖిల్, ఆర్వో భుజంగరావు, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

జి. సునీల్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఘనంగా ఇన్వెస్టిచర్ సెరిమని

జన్నారం, జూలై 17 (విజన్ ఆంధ్ర) : జన్నారం మం దలకేంద్రంలోని స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యం లో శుక్రవారంరోజున ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్ర మాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్లేట్ హై స్కూల్ హెడ్ గర్ల్ పర్వాని, హెడ్ బాయ్ మిఖిల్, స్లేట్ ఎక్సలెన్స్ (సిబిఎస్ ఇ) హెడ్ గర్ల్ వి. సాయి రితిక, వైస్ హెడ్ గర్ల్ ప్రసన్న, హెడ్ బాయ్ కే. వైభవ్, వైస్ హెడ్ బాయ్ రయాన్ లు ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా రెండు పాఠశాలల హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, కల్చరల్ మి నిస్టర్ సాన్వి, ఇన్నోవేషన్ మినిస్టర్ ఆధ్యా, ఎడ్యు కేషన్ మినిస్టర్ పవిత్ర, స్పోర్ట్స్ మినిస్టర్ రితేష్ ల కు తహసీల్దార్ బక్కయ్య, ఎస్ఐ ఉదయ్ కిరణ్ ల చేతుల మీదుగా బ్యాడ్జీలు, సాష్‌లు అందజేసి బా ధ్యతలు అప్పగించారు. అనంతరం వారు మాట్లా డుతూ క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యత, సేవాభా వం విద్యార్థులను ఉ న్నత శిఖరాలకు చేర్చే విలు వలు అని విద్యార్థి దశలో అలవడిన మంచి అల వాట్లే జీవిత విజయానికి పునాది అని విద్యార్థి నా యకులు చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, బాధ్యత, సేవా దృక్పథంతో ముందుండి ఆదర్శంగా నిలవాల ని సూచించారు. అనంతరం స్లేట్ స్కూల్స్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సాధారణ విద్యాసంస్థలు కావని తరాలు మారినా అదే నాణ్యత, అదే క్రమశిక్షణ, అదే విలు వలతో ముందుకు సాగుతాయని తెలిపారు. నాయ కత్వం అంటే హోదా కాదని, బాధ్యత అని గుర్తు చేశారు. స్మార్ట్ లక్ష్యాలు,



సమయ నిర్వహణ, నిజా యితీ, క్రమశిక్షణ, జట్టు కృషి, సంభాషణ సేవభా వం, నాయకత్వం వంటి లక్షణాలు ప్రతి విద్యార్థిని విజయవంతమైన నాయకుడిగా తీర్చిదిద్దుతాయ ని హౌస్ లీడర్లు, స్కూల్ క్యాబినెట్, మినిస్టర్లు పా ఠశాల లక్ష్యాన్ని దూరదృష్టి విలువలను ఆచరణ లో చూపించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్స్ వ్యవ స్థాపకులు ఏనుగు శుభాష్ రెడ్డి, డైరెక్టర్ రజిత , స్లే ట్ హైస్కూలు ప్రిన్సిపాల్ ప్రియ శివ, స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శిరిన్ ఖాన్, ఉపాధ్యాయులు కృష్ణ, భానుచందర్ , రాజశేఖర్ , జాకీర్ , వినోద్ , జినిల్ , బాబు తదితరులు పాల్గొన్నారు.

# కంటి సమస్యల పరిష్కారం కోసం కృషి

## – 11వ వార్డులో ఉచిత కంటి పరీక్షల శిబిరం



సిద్దిపేట జిల్లా (హుస్నాబాద్), జూలై 17 : కంటి సమస్యల పరిష్కారం కోసమే శరత్ మాక్స్ విజన్ సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించినట్లు 11 వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ ఆధ్వర్యంలో శరత్ మ్యాక్స్ విజన్ సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోరే సందీప్ కుమార్, ఆప్తమాలజిస్ట్ అనూష, సీహెచ్‌డబ్ల్యు సదానందం ఆధ్వర్యంలో 56 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఆపరేషన్ అవసరమైన ఏడుగురి కి ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని తెలిపారు. కంటి సమస్యలపై అశ్రద్ధ చేయరాదని, ఉచిత కంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ వర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష సాగర్, బూరుగు లత కృష్ణస్వామి, కొండ రజిత సతీష్, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, కేశవేణి రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్, గాదపాక రవీందర్, బత్తుల సరూప రవీందర్, గోపగోని శోభన్, కో–ఆప్షన్ సభ్యుడు హసన్ పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన ఏఓ హరికృష్ణ



విజన్ ఆంధ్ర: సిర్గాపూర్, జూలై 17:సిర్గాపూర్ మండలంలోని వాసర్ గ్రామంలో ఉన్న ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ వివరాలు, లైసెన్స్ పత్రాలు, ధరల ప్రదర్శన బోర్డును పరిశీలించారు.రైతులకు ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే నాణ్యమైన ఎరువులను విక్రయించాలని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని దుకాణ యజమానికి సూచించారు. ఎరువులను నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ఏవైనా అవకతవకలు గమనిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఏఓ హరికృష్ణ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల నమోదును పెంచాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు

భూపాలపల్లి జిల్లా జులై 17 (విజన్ ఆంధ్ర ) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కేజీబీవీ, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, ఏకరూప దుస్తుల పంపిణీ, తెలంగాణ పబ్లిక్ పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయుట తదితర అంశాలపై విద్యా, పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చల్లగరిగ పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల ఏర్పాటుకు తక్షణమే అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన సమీక్షా సమావేశానికి గైర్హాజరైన తెలంగాణ రాష్ట్ర విద్యా మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ ) విభాగం డీఈ, ఏఈలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు.

5 నుండి 8వ తరగతుల విద్యార్థులు ఎక్కువగా డ్రాపౌట్ అవుతున్నారని, వారిని తిరిగి బడిబాట పట్టించడంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ



ఉండాలని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తుల కుట్టు పనులను వేగంగా పూర్తి చేస్తున్న మహిళా స్వయం సహాయక సంఘాలను కలెక్టర్ అభినందించారు. ఇదే ఉత్సాహంతో మిగిలిన కుట్టు పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, డీఆర్‌డీఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జామా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో వర్షాలు కురువాలని ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 17 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు వారి సూచన మేరకు హుస్నాబాద్ పట్టణంలో స్థానిక ముస్లింలు వర్షాలు కురవాలని శుక్రవారంరోజున నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జామా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున జోహర్ నమాజు తర్వాత తెలంగాణ రాష్ట్రంలో అల్లా దీవెనలతో వర్షాలు సమృద్ధిగా కురువాలని, చెరువులు, కుంటలు నిండి పాడిపంటలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని జామా మజీద్ ఇమామ్ షేక్ రుహుల్ అమీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన మరియు దువా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండి భాషుమియా, ప్రధాన కార్యదర్శి ఎం డి హసన్, ఎండి అయూబ్, ఎండి పసియుద్దిన్, కే అతిక్,యండి యం యస్ అలీ,యండి ఆఫ్జల్,ఎండి షబ్బీర్, ఎండి అక్బర్, ఎండి ముంతాజ్,యండి రఫీ,సయ్యద్ ఇంతియుజ్ ,యండిఅశ్రఫ్ ,యండి ఈసా,యండి యూనుస్ మౌజన్ గారు పట్టణ మరియు పరిసర ప్రాంత ముస్లిం సహోదరులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు అందించిన వెడ్మ బొజ్జు పటేల్

## - నిరుపేదలకు అండగా కాంగ్రెస్ సర్కార్ ఎమ్మెల్యే బొజ్జు



ఉట్నూర్, జులై 17, (విజన్ ఆంధ్ర) : ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉట్నూర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్. రాసేవార్ రాధాబాయికి 60,000 రూపాయల చెక్కు, హీనా తబస్సుకు 20,000 రూపాయలు, పర్వీన కు 14,000 రూపాయలు చెక్కులను ఇచ్చిన ఎమ్మెల్యే బొజ్జు. పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుంది అని, ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తుంది అని అన్నారు.

# పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, ప్లాస్టిక్ రహిత గ్రామాల లక్ష్యాలతో స్టీల్ బ్యాంక్

అక్కన్నపేట, జూలై 17 (విజన్ ఆంధ్ర) : పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, ప్లాస్టిక్ రహిత గ్రామాల లక్ష్యాలతో ప్రారంభించిన స్టీల్ బ్యాంక్ కార్యక్రమం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకోవడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. స్వర్గీయ పొన్నం సత్తయ్య స్మారకార్థం, శ్రీ పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వంత నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గత ఏడాది జూలై 17న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ప్రారంభమైన స్టీల్ బ్యాంక్ కార్యక్రమం గ్రామాల్లో పర్యావరణ చైతన్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని కేవలం నిషేధించడం కాకుండా దానికి శాశ్వత ప్రత్యామ్నాయం అందించాలనే ఉద్దేశంతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని 276 గ్రామ మహిళా సమైక్య సంఘాలకు ఉచితంగా 276 స్టీల్ బ్యాంక్ సెట్లను అందించినట్లు మంత్రి తెలిపారు. ఒక్కో సెట్‌లో 13 రకాల స్టీల్ పాత్రలు ఉండేలా, 300 నుంచి 500 పాత్రల సామర్థ్యంతో గ్రామాల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమం ద్వారా 7,376 స్వయం సహాయక సంఘాలకు చెందిన 80,633 మంది మహిళా సభ్యులు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతున్నారని, ఇందుకోసం రూ. 2.54 కోట్లకు పైగా స్వంత నిధులు వెచ్చించినట్లు తెలిపారు.

గ్రామాల్లో వివాహాలు, శుభకార్యాలు, అన్నదానాలు, గ్రామసభలు వంటి కార్యక్రమాల్లో ప్లాస్టిక్ పాత్రలకు బదులుగా స్టీల్ పాత్రల వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గి గ్రామాలు మరింత పరిశుభ్రంగా మారాయని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా నియోజకవర్గంలోని 319 హోటళ్లకు 33,900 స్టీల్ గ్లాసులను ఉచితంగా పంపిణీ చేసి, ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ గ్లాసులకు శాశ్వత ప్రత్యామ్నాయం కల్పించినట్లు మంత్రి వివరించారు.

మహిళా సంఘాలు స్టీల్ బ్యాంకులను సమర్థవంతంగా నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన అభినందించారు. ప్రజల్లో బాధ్యత పెరగడంతో పాటు పరిశుభ్రమైన జీవన విధానం అలవాటవుతోందని చెప్పారు.

ప్లాస్టిక్ నిర్మూలనతో పాటు మొక్కల నాటడం, చెరువుల అభివృద్ధి, ప్రజా ప్రదేశాల సుందరీకరణ కార్యక్రమాలను కూడా చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఎల్లమ్మ చెరువు, పల్లె చెరువు, కొత్త చెరువు పరిసరాల అభివృద్ధి, త్రిశూలం జంక్షన్, గాంధీ విగ్రహం పరిసరాలు, "ఐ లవ్ హుస్నాబాద్" ప్రాంతం, యోగా లోగోలతో కూడిన డివైడర్లు, ఎల్లమ్మ చౌరస్తా వంటి ప్రాంతాలు పరిశుభ్రత, పచ్చదనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు నిర్మించడం మాత్రమే కాదని, సమాజంలో శాశ్వత మార్పు తీసుకువచ్చే ఆలోచనలే నిజమైన అభివృద్ధి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ప్లాస్టిక్ రహిత హుస్నాబాద్ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ, భావితరాలకు పరిశుభ్రమైన, పచ్చని, ఆరోగ్యకరమైన నియోజకవర్గాన్ని అందించేందుకు కృషి కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, స్టీల్ బ్యాంక్ కార్యక్రమం వల్ల గ్రామాల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు, అన్నదానాలు తదితర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ పాత్రల వినియోగం గణనీయంగా తగ్గిందని మహిళా సంఘాల ప్రతినిధులు తెలిపారు. స్టీల్ బ్యాంకుల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడం తమపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పేర్కొంటూ, గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో పాత్రలను అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని వారు వెల్లడించారు.

# గ్రామ దేవతలకు జలాభిషేకం...

బోధన్, జూలై 17(విజన్ ఆంధ్ర) : బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామస్తులు వర్షం కురవాలని కోరుతూ శుక్రవారం గ్రామం నుండి రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామంలో గల పవిత్ర త్రివేణి సంగం నుండి గంగా నీళ్లు తీసుకొచ్చారు. తీసుకొచ్చిన నీటితో గ్రామంలో ఉన్న గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడి పంట గ్రామ ప్రజలు రైతులు సుఖంగా ఉండాలని ఆ గంగా మాతని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ జ్యోతి శంకర్, వీడీసీ చైర్మన్ గంగాధర్, తుడం బాబు, వార్డ్ మెంబర్లు, చంద్రకాంత్, మల్లుగౌండ, అశోక్, హన్మండ్లు, నాగు, గ్రామ పెద్దలు రాజన్న, మొగులయ్య, లక్ష్మణ్, గౌర్ గోండా, చందయ్య, సుధాకర్ , యువకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూర్ ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన మండల అధికారులు

### - మండల స్పెషల్ ఆఫీసర్ వసంత కుమారి



చౌటకూర్, జూలై 17: చౌటకూర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను మండల స్పెషల్ ఆఫీసర్ వసంత కుమారి ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంటశాల, ఆహార నాణ్యత, వంట సామగ్రి, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన అధికారులు హాస్టల్‌లో అందుతున్న భోజనం, వసతి, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను విని, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన అధికారులు అక్కడి విద్యార్థులతో కూడా మాట్లాడి విద్యా బోధన, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంపీడీవో శంకర్, ఎంఈఓ అనురాధ, ఎస్సీ హాస్టల్ వార్డెన్ రవీందర్, ఉపాధ్యాయుడు మోహన్ రెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు,పుస్తకాలు పంపిణీ

### మాజీ ఎంపీపీ కాశీనాథ్



అందోల్ జూలై 17 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని చేవెళ్ల గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో మాజీ ఎంపీపీ కాశీనాథ్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా తనవంతుగా పుస్తకాలు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లి దండ్రులకు గ్రామానికి సమాజంలో మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మచ్చేందర్,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉప సర్పంచ్ వడ్ల నాగప్ప , గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంతప్ప, యూత్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి..

### అబ్బాయిపాలెం గ్రామంలో ఇంటింటి సర్వేలో

### సిపిఐ (ఎం) మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్



మరిపెడ , విజన్ ఆంధ్ర : రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను వెంటనే మంజూరు చేయాలని ఇప్పటికే ఫస్ట్ విడుదల ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సిపిఐ (ఎం) మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ అన్నారు.మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో సిపిఐ (ఎం) ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. మరిపెడ మండలంలో 655 ఇండ్లు మొదటి విడతలు మంజూరు కాగా,అందులో 242 పూర్తిచేసుకున్నాయని తెలిపారు.మిగతా ఇండ్లు వివిధ దశలో నిర్మాణాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు పూర్తయిన 242 ఇండ్లకు వెంటనే బిల్లు పెండింగ్ లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు.మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో 120 మంది ఇల్లు లేని నిరుపేదలు ఇండ్ల కోసం ఆన్లైన్ చేసుకోగా అందులో మొదటి విడతలో 32 మంజూరైనట్లు అందులో ఒకటి రెండు మినహా మిగినే అన్ని నిర్మాణంలో ఉన్నాయని ,ఇందులో సగం ఇల్లు పూర్తయినట్లు మధు వివరించారు. ఎల్ 3, ఎల్ 2, కేటగిరి లో ఉన్న ఇండ్లను అధికారులు పరిశీలించి వారందరికీ పెండింగ్ బిల్లులు మంజురైన చేయాలి,లేదా కొత్త ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.అంతేగాక ఈ గ్రామంలో నిరుపేదలు ఎక్కువమంది ఉన్నారని, ఉపాధి హామీ పథకంలో 12000 రూపాలు ఇస్తామని ప్రభుత్వం గత ఎన్నికల్లో హామీ ఇచ్చిందని,వెంటనే దానిని వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) వార్డు సభ్యురాలు నందిపాటి ఉప్పలమ్మ వెంకన్న,నాయకులు లచ్చయ్య,కామిడ్ల వెంకన్న, జినక సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# జిపిఓపై దాడిని ఖండించిన గ్రామ పాలన అధికారుల సంఘం



చౌటకూర్, జూలై 17 (విజన్ ఆంధ్ర):– వడ్డేపల్లి గ్రామంలో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓ సూపర్వైజర్ (జిపిఓ) సంబరబోయిన సత్యనారాయణపై జరిగిన దాడిని గ్రామ పాలన అధికారుల సంఘం (జీపీఓ అసోసియేషన్) చౌటకూర్ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చౌటకూర్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.సంఘం తెలిపిన వివరాల ప్రకారం, జూలై 15న సాయంత్రం వడ్డేపల్లి గ్రామంలో ఈఎఫ్ ఫారాల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సమయంలో ముక్కగళ్ల సత్యనారాయణ అనే వ్యక్తి అక్కడికి వచ్చి దురుసుగా ప్రవర్తించి, విధుల్లో ఉన్న బీఎల్ఓ సూపర్వైజర్ సంబరబోయిన సత్యనారాయణపై చేయి చేసుకుని, ముఖంపై దాడి చేసి పిడిగుద్దులతో కొట్టినట్లు ఆరోపించారు.విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం అత్యంత ఖండనీయమని సంఘం నాయకులు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఉద్యోగుల భద్రతను కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలన అధికారుల సంఘం మండల అధ్యక్షుడు సమీర్, జిల్లా అధ్యక్షుడు ఎన్. సత్యనారాయణ, ఈశ్వర్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూర్ మండల రెవెన్యూ కార్యాలయానికి రూ.52 వేల విలువైన ఇన్వర్టర్ విరాళం

### – రెవెన్యూ అధికారులు గ్రామ సర్పంచ్ పార్కల రాం రెడ్డికి శాలువాతో ఘన సన్మానం

చౌటకూర్, జూలై 17: చౌటకూర్ మండల కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయానికి గ్రామ సర్పంచ్ పార్కల రాం రెడ్డి రూ.52 వేల విలువైన బ్యాటరీ ఇన్వర్టర్‌ను విరాళంగా అందజేశారు. కార్యాలయంలో విద్యుత్ అంతరాయాల సమయంలో అధికారులు, సిబ్బంది విధులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండే ఉద్దేశంతో ఈ ఇన్వర్టర్‌ను అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అధికారులు గ్రామ సర్పంచ్ పార్కల రాం రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి, ఆయన చేసిన సేవలను అభినందించారు. ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి సహకరించడం ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ రెడ్డి, తాసిల్దార్ నామాల కిష్టయ్య, ఎంపీడీవో శంకర్, డిప్యూటీ తహసీల్దార్ అనుదీప్, మండల స్పెషల్ ఆఫీసర్ వసంత కుమారి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రామ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పార్కల రమేష్, రాజేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శంకరంపల్లిలో ఘనంగా వనమహోత్సవం



కాటారం డివిజన్ ప్రతినిధి, జూలై 17 (విజన్ ఆంధ్ర): : పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మండల పరిధిలోని శంకరంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వేదికగా శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ అజ్మీర కిషన్ నాయక్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి గ్రామస్తుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా గ్రామ ప్రజలకు పండ్ల, పూలతో పాటు నీడనిచ్చే వివిధ రకాల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొక్కలను స్వీకరించిన గ్రామస్తులు తమ ఇళ్ల పరిసరాల్లో వాటిని నాటి సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు .

## నేడు పరిగికి రాష్ట్ర మంత్రులు రాక

పరిగి, జూలై 17 (విజన్ ఆంధ్ర): రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, వికారాబాద్ జిల్లా ఇంచార్జి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేడు పరిగికి విచ్చేస్తున్నట్లు ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ఐఆర్) డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్ గేటు దగ్గర రూ. 185 కోట్ల రూపాయలతో రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడి నుండి కార్యకర్తలతో భారీ ర్యాలీగా బయలుదేరి పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అధికారంలోకి వచ్చాక గతంలో ఎన్నడూ లేని విధంగా పరిగి నియోజకవర్గంలో ఉన్న సింగల్ రోడ్లన్ని డబుల్ రోడ్లులుగా, డబుల్ రోడ్లు నాలుగు లైన్ల రోడ్లుగా అభివృద్ధి జరుగుతున్నాయని తెలిపారు. నేటి మంత్రుల కార్యక్రమానికి నియోజకవర్గంలో అన్ని మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## చిన్నతుండ్లలో ముమ్మరంగా సిసి రోడ్డు నిర్మాణ పనులు

**సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించిన సర్పంచ్ గడ్డం క్రాంతి**



మల్హర్, జూలై 17 విజన్ ఆంధ్ర : చిన్నతుండ్ల గ్రామంలోని 1వ మరియు 2వ వార్డులలో సీసీ రోడ్డ నిర్మాణ కార్యక్రమం చిన్నతుండ్ల గ్రామ సర్పంచ్ గడ్డం క్రాంతి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పులిగంటి సదయ్య, పులిగంటి అవినాష్, పులిగంటి రాజేశ్వరి-రమేష్, మంతెన సరిత-రమేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పులిగంటి రాజయ్య, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు ఐలి చంద్రయ్య, గ్రామ శాఖ యూత్ అధ్యక్షులు ఐలి నాగేష్, మాజీ ఉపసర్పంచ్ బొబ్బిలి సురేష్, గ్రామ సీనియర్ నాయకులు కమలాకర్ రావు, కోట శ్రీనివాస్, ఇమ్మడిశెట్టి సాయిరాం, కోట సమ్మయ్య, కోట లక్ష్మయ్య, పులిగంటి బాపు, కూర నరేష్, ఒరుగంటి లక్ష్మయ్య, మిరియాల ప్రకాష్ రావు పాల్గొన్నారు.

# విద్యారంగా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి**

**- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజేష్ డిమాండ్**



కొండాపూర్ విజన్ ఆంధ్ర జూలై 17 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ ను భ్రష్టు పట్టించింది అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజేష్ శుక్రవారం మాట్లాడుతూ గత 6 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ 10500 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్ షిప్ పెంచాలని అన్నారు సంక్షేమ వసతి గృహా విద్యార్థులకు మేస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు .. స్కాలర్షిప్ తో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని అన్నారు మరియు సెల్ఫ్ ఫైనాన్స్ చదువుతున్న విద్యార్థులకు ఫీజు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని అన్నారు తక్షణమే విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ,మండల అధ్యక్ష కార్యదర్శులు హరీష్ ప్రశాంత్ ,ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయం కార్యదర్శి టీ అర్జున్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వాణి , ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు మనోహర్ ,ఈశ్వర్ , సంజయ్ , అరవింద్ , రాహుల్, శివకుమార్,తదితరులు పాల్గొన్నారు.

# గాదంపల్లిలో వైభవంగా వారాహి నవరాత్రులు

**కుండ ప్రతిష్ట, హోమ కార్యక్రమాలు**



మల్హర్, జూలై 17 విజన్ ఆంధ్ర : మండలంలోని గాదంపల్లి గ్రామంలోని వారాహి నవరాత్రుల పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వారాహి మొదటి నవరాత్రుల రోజులను పురస్కరించుకొని, వేద త్రిపుర పీఠ అధిపతులు శ్రీ లోకే రాము ఆదేశానుసారం వారి శిష్య బృందం ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కళ్యాణ సిద్ధ్యర్థం శుక్రవారం కుండ ప్రతిష్ట కార్యక్రమం మరియు హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆ వారాహి మాత అనుగ్రహం ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని, అందరూ చల్లగా ఉండాలని కోరుకుంటూ గాదంపల్లి హనుమాన్ సహిత శివ పంచాయతన సుబ్రహ్మణ్యేశ్వర వారాహి దత్త ఆలయ కమిటీ సభ్యులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ప్రాంత ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ తరఫున భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె రవి కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి మాత భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతన్న కోసం బోథ్ వేదం విద్యార్థుల గళం

బోథ్. జూలై 17.(విజన్ ఆంధ్ర) బోథ్ మండలంలోని స్థానిక వేదం పాఠశాల విద్యార్థులు రైతుల కష్టాలు, అన్నదాతలు ఎదుర్కొంటున్న సవాళ్లను హృదయానికి హత్తుకునేలా పాట రూపంలో ఆవిష్కరించారు. వర్షం కోసం ఎదురుచూసే రైతుల కష్టాలు తీరాలని, వర్షం పడాలని దేవుడికి ప్రార్థనలు చేసి వానలు కురవాలని పాటలు పాడి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులు దేవతలను పూజించి నీరు పోసి వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారని విత్తనాలు వేసి చాలా రోజులవుతున్న మొలకలు ఎండిపోతున్నాయని రైతన్నలు ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారని వర్షం కురిపించి రైతన్నల కష్టాలు తీరాలని కోరుతూ ఆలపించిన అభినయం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు నిధులు మంజూరు...

**-బోధన్ లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్..**

**- హాస్పిటల్ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష..**

**- ఆసుపత్రిలో అపరిశుభ్రతపై కలెక్టర్ అసంతృప్తి..**

**పారిశుధ్య కాంట్రాక్టు ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశం..**

బోధన్, జూలై 17 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలోని అవుట్ పేషంట్ బ్లాక్, కాన్పుల విభాగం, ఇమ్యూనైజేషన్ గది, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ తదితర విభాగాలను సందర్శించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణను, శిథిలావస్థకు చేరిన ఐసోలేషన్ వార్డు భవనాన్ని పరిశీలన జరిపారు. ఆసుపత్రి ఆవరణ, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ పారిశుధ్య కాంట్రాక్టు ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. పరిస్థితిలో మార్పు రాకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డా. కవితా రెడ్డితో కలిసి బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా. శ్రీనివాస్ ప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర



వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి రికార్డులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు స్టేట్ మెంట్లను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రిలో నెలకొని ఉన్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల సగటున 200 వరకు కాన్పులు జరుగుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆసుపత్రిలో బర్త్ వెయిటింగ్ రూం ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మెడికో లీగల్ కేసులు ఎక్కువగా వస్తున్నందున, భద్రతాపరమైన అంశాల రీత్యా ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా పోలీసు శాఖకు ప్రతిపాదిస్తామని తెలిపారు. వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై నమ్మకాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితవు పలికారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రోగులకు నాణ్యమైన సేవలు అందించేలా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మౌలిక సదుపాయాలను, వైద్యులను, సిబ్బందిని సమకూరుస్తామని, అయినా కూడా వైద్య సేవలలో లోపాలు ఉంటే ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు జరుపుతానని, నిర్లక్ష్యానికి తావు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. స్థానిక ఆర్డీఓ నేతృత్వంలో ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించి, ఆసుపత్రి నిర్వహణ తీరుతెన్నులపై తనకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

# నేడు తాండూరు లో మంత్రుల పర్యటన

**--రూ. 290 కోట్ల హ్యామ్ పనులకు శంకుస్థాపనలు**
**--రూ.25 కోట్ల పరిహార చెక్కుల పంపిణీ, ప్రగతి సభ**

తాండూరు, జులై 17 (విజన్ ఆంధ్ర): నేడు వికారాబాద్ జిల్లా తాండూరులో మంత్రులు పర్యటించనున్నారు. ఖరారయ్యింది. శనివారం తాండూరుకు తెలంగాణ రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబులు విచ్చేస్తున్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో హ్యామ్ ప్రాజెక్టు కింద తాండూరు నియోజకవర్గంకు మంజూరైన రూ. 290 కోట్ల పనులకు మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అంతారం గ్రామ పరిధిలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ లు శంకుస్థాపనలు చేయనున్నారు. అదేవిధంగా ఉదయం 10:15 గంటలకు కందనెల్లి పరిధిలోని జీపీఆర్ గార్డెన్స్‌లో బైపాస్ భూనిర్వాసితులకు రూ.25 కోట్ల పరిహార చెక్కుల పంపిణీ, ప్రగతి సభ నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి విజ్ఞప్తి చేశారు.



## ఆత్మీయ వీడ్కోలుతో గోపికి ఘన సత్కారం

బెల్లంపల్లి జులై 17 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి కళాశాల శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ ఉప్పు గోపికి బదిలీ సందర్భంగా పోటీ పరీక్షల అభ్యర్థులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. చెన్నూర్ గ్రంథాలయానికి బదిలీపై వెళ్తున్న ఆయనను శుక్రవారం గ్రంథాలయ ఆవరణలో శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ ఉప్పు గోపి సేవలు మరువలేనివని అన్నారు.

ఆయన హయాంలో రూ.75 లక్షల వ్యయంతో నూతన గ్రంథాలయ భవనం, బోరు నిర్మాణం పూర్తయ్యాయని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడంతో పాటు, ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మెలుగుతూ ప్రోత్సహించారని కొనియాడారు. చెన్నూర్‌లోనూ ఆయన సేవలు మరింత మందికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో బండి ప్రవీణ్‌కుమార్, ఇప్ప రాజేంద్రప్రసాద్, తాటిపాముల నరేష్, దామెర విజయ్, దాసరి అలేఖ్య, అటెండర్ ఇరుగురాల శ్రీనివాస్, స్వీపర్ నీలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలి

**కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇటీవల కాలంలో భారీగా పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్.**

భూపాలపల్లి జిల్లా జులై 17 (విజన్ ఆంధ్ర ) కేంద్ర ప్రభుత్వం ఎరువుల కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసం 50 కిలోల బస్తాకు 50 రూపాయల నుండి 300 వరకు పెంచడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం ఎల్ )జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ..

రైతు పండించిన 13 రకాల పంటలకు పది రూపాయల నుండి 50 రూపాయల వరకు పెంచి దేశంలో రైతులను ధనికులుగా మారుస్తున్నామని చెప్పటం సిగ్గుచేటు అన్నారు. ఎరువుల కంపెనీల లాభాల కోసం దేశంలో కోటాను కోట్ల మంది చిన్న సన్నకారు మధ్యతరగతి రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్న మోడీ ప్రభుత్వం తీరును వారు ఖండించారు. విత్తనాల నుండి పంటను అమ్ముకునే వరకు రైతు స్వతంత్రతను దెబ్బతీస్తూ కంపెనీలకు లబ్ధి చేకూరేటట్టుగా చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలు చేయటం సరికాదని



అన్నారు. రాష్ట్రంలో రైతాంగం పంట పెట్టుబడికి అన్ని వాణిజ్య బ్యాంకులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం 18 శాతం రుణాలు ఇవ్వాలని వారు కోరారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బ్యాంకర్లతో కచ్చితంగా మాట్లాడాలని కోరారు. లేదంటే రైతాంగం ప్రైవేటు అప్పులు తెచ్చుకొని పెద్ద ఎత్తున రుణగ్రస్తులుగా మారే ప్రమాదం ఉందని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాలి అన్నారు బంధు క్రాంతి... ఆత్మూరి శ్రీకాంత్ రాజు పాల్గొన్నారు .

## చౌటకూర్ గ్రామంలో వ్యవసాయ అవగాహన కార్యక్రమం నిర్వహణ

చౌటకూర్, జులై 17 (విజన్ ఆంధ్ర):- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ కార్యాచరణ అనుభవ కార్యక్రమం (ఖ్రువ)లో భాగంగా శుక్రవారం చౌటకూర్ మండలం కేంద్రంలో చౌటకూర్ గ్రామంలో రైతులకు వ్యవసాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సామాజిక పటం, వనరుల పటం, కాలక్రమ పటం, పంటల పటం తదితర వివిధ రకాల గ్రామ పటాలను రూపొందించి గ్రామంలోని సహజ వనరులు, వ్యవసాయ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, వివిధ పంటల సాగు విధానాలు, పంటల నిర్వహణపై రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శంకర్, మండల ప్రత్యేక అధికారి వసంత కుమారి, తహసీల్దార్ కృష్ణయ్య, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి, వ్యవసాయ అధికారి ప్రవీణ, టీఆర్‌వీకే సమన్వయకర్త అరుణ ,వ్యవసాయ కళాశాల విద్యార్థినులు శ్రీనిధి, దివ్య, రితిక, ధృతి, ఎస్తేర్ రాణి కార్యక్రమ నిర్వహణలో రైతులతో ప్రత్యక్షంగా మమేకమై వ్యవసాయ సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి భూముల రీ సర్వే

**--- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

అందోల్ జులై 17 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) పక్కగా ప్రతి ఒక్కరి భూముల రీ సర్వే చేయాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు.మెదక్ జిల్లా అల్లాదుర్గంలో శ్రీ వెంకటేశ్వర ఆలయం లో శుక్రవారం నిర్వహించిన భూముల రీసర్వే గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. భూ సమస్యలు తలెత్తకుండా ,ప్రతి రైతుకు భూ హక్కులు కల్పించేలా భూమి రీ సర్వే చేయాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు.రైతులకు భూ వివాదాలు లేకుండా చేసి , ప్రతి భూ కమతానికి భూధార్ అందిస్తామన్నారు. భూ పటాలను ప్రక్షాళన చేయాలన్నారు.

పక్కగా భూ రీ సర్వే చేసి హద్దులను నిర్ణయించేందు కే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం టేక్మాల్ మండలంలో విలేజ్ బౌండరీ సంబంధిత తహసీల్దార్ తో కలిసి మెదక్ జిల్లా అదనపు



కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు వివాదాలకు తావు లేకుండా రైతులకు మేలు చేకూరే విధంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ఈ కార్యక్రమం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,స్థానిక తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ లినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం

## రైతులకు పంటల సాగుపై అవగాహన

భూపాలపల్లి జిల్లా జులై 17 (విజన్ ఆంధ్ర ) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్ లినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలన్న అంశంపై వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, సాగులో వైవిధ్యాన్ని పాటించి, తక్కువ నీటి వినియోగంతో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని ఆయన సూచించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు వీలుగా మిల్లెట్స్, కూరగాయలు, పప్పు దినుసులు, పామాయిల్ సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల కంటే ఆరుతడి పంటలు, తక్కువ రోజుల్లో చేతికి వచ్చే రకాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పర్యటించి, ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన పంటల వివరాలను రైతులకు వివరించాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు బిందు, తుంపర్ల సేద్యం వంటి ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

?మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సలహాలు, సూచనలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. బోరు బావుల ద్వారా పంట సాగు చేస్తున్న రైతులు వరి సాగు చేయొద్దని, రానున్న రోజుల్లో భూ గర్భ జలాలు తగ్గిపోయి నీటి కొరత ఏర్పడుతుందని తద్వారా పంట నష్టం వస్తుందని సూచించారు. కూరగాయలు సాగుకు ప్రభుత్వం ఎకరాకు 9600 రూపాయలు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సాగు చేయాల్సిన పంటలపై జిల్లా కంటింజెంట్ (జిల్లా అత్యవసర ప్రణాళిక) ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు.

?ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా ఉద్యాన అధికారి తిరుపతి, వ్యవసాయ శాఖ ఏడీఏలు శ్రీపాల్, రమేష్, అన్ని మండలాల ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం



పరిగి, జూలై 17(విజన్ ఆంధ్ర ): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం అని సర్పంచ్ సుగుణ సుందరి చిన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పల్లెర్ల శ్రీశైలంకు రూ. 45 వేలు, బట్టోళ్ల పద్మమ్మకు రూ. 32వేల 5 వందలు, కుర్వ మల్లమ్మకు రూ. 32 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పరిగి ఎమ్మెల్యే డాక్టర్. టి. రామ్మోహన్ రెడ్డి ఆదేశానుసారం స్థానిక సర్పంచ్ సుగుణ సుందరి చిన్నయ్య లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దొబ్బలి చెన్నయ్య, బొంగు చిన్న బుగ్గయ్య, పంచాయతీ కార్యదర్శి అరుణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బుర్రా అగయ్య-రుక్కమ్మ దంపతుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

**దూలపల్లి డివిజన్‌లో ఘనంగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ**

**సమాజ సేవలో వారి కృషి చిరస్మరణీయమని కొనియాడిన హన్మంత్ రెడ్డి**

**కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం**

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు**

కుత్బుల్లాపూర్, జులై 17 (విజన్ ఆంధ్ర); కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 289 దూలపల్లి డివిజన్‌లో మాజీ సర్పంచ్, కొంపల్లి పీఏసీఎస్ (ఫౌజా) వ్యవస్థాపకులు, మాజీ చైర్మన్ కీ.శే. బుర్రా అగయ్య మరియు ఆయన సతీమణి కీ.శే. బుర్రా రుక్కమ్మ (లక్ష్మీదేవి) దంపతుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, బుర్రా అగయ్య--రుక్కమ్మ దంపతులు సమాజాభివృద్ధి, సహకార రంగం, గ్రామాభివృద్ధికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, బుర్రా అగయ్య--రుక్కమ్మ దంపతులు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసి గ్రామ ప్రజల మన్ననలు పొందారని, వారి సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ మహోత్సవంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని దంపతులకు ఘన నివాళులు అర్పించారు.

# చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం

కుల్కచర్ల, జూలై, 17(విజన్ ఆంధ్ర): చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించినట్లు కుల్కచర్ల సర్పంచి అంజిలయ్య, ఉప సర్పంచి విజయ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన కుల్కచర్ల అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సి ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పాలు, గుడ్లు, పోషకాహార పదార్థాలను అందించడం జరుగుతుందన్నారు. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. అంతేకాకుండా అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.



# గడువులోగా సర్ దరఖాస్తులను బిఎల్ఓ లకు అందజేయాలి

## బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లసంతోష్ చారి

పాపన్నపేట, విజన్ ఆంధ్ర,జూలై17: భారత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్ ప్రక్రియ తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ)పాపన్నపేట మండలంలో అన్ని బూతులలో బిఎల్ఓ లను నియమించినట్లు పాపన్నపేట మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు వడ్లసంతోష్ చారి తెలిపారు. శుక్రవారం నాడు ఆయన మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి ఎన్యుమరేషన్ ఫారాల భర్తీ ప్రక్రియను సమీక్షించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాచారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గడువు పొడిగించినప్పటికీ ఒకేసారి తాకిడి ఎక్కువైతే సర్వర్లు మొరాయించే అవకాశం ఉన్నందున ప్రజలందరూ వీలైనంత త్వరగా సర్ దరఖాస్తులను బిఎల్ఓలకు అందేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం,ప్రభుత్వ యంత్రాంగం కూడా కొద్దిగా అలసత్వం ప్రదర్శిస్తుందనీ,ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ప్రజలకు సర్ పై అవగాహన కల్పించడంలో బిజెపి నాయకులు ముందుండాలని



ఆయన ఆశా భావాన్ని వ్యక్తం చేశారు.రాబోయే కాలంలో భారతీయతకు కేవలం ఓటర్ గుర్తింపు కార్డు మాత్రమే ప్రామాణికం అవుతుందని,మరే ఇతర కార్డు కూడా ప్రామాణికం కాబోదని ప్రజలు ఈ విషయాన్ని గుర్తెరిగి తక్షణమే వారి ఇన్యూమేరేషన్ ఫారాలను బిఎల్ఓ ల కు అందజేయాల్సిందిగా బీజేపీ పార్టీ తరపున సూచిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, మైనార్టీ మోర్చా అధ్యక్షులు గౌస్,కార్యదర్శులు సాయిబాబా,జిన్నగోపాల్, మల్లేశం,బాచారం బూత్ అధ్యక్షులు బిఎల్ఓ వెంకట్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ జాలీలతో ప్రాణాలకే ముప్పు

- **గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన**
- **టీ దుకాణాల్లో వేడి వేడి టీ వడ కట్టడానికి ప్లాస్టిక్ జాలీల వాడకం**
- **క్యాన్సర్ వంటి మహమ్మారి బారిన పడుతున్న ప్రజలు**
- **మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు**

గజ్వేల్, 17 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల ప్రాణాలతో వ్యాపారులు చెలగాటం ఆడుతున్నారు. పట్టణంలోని పలు టీ దుకాణాలు, హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ జాలీలను విచ్చలవిడిగా వాడుతున్నారు. పొగలు కక్కే వేడి వేడి టీని ఈ ప్లాస్టిక్ జాలీల ద్వారా వడకట్టడం వల్ల ప్లాస్టిక్‌లోని ప్రమాదకర రసాయనాలు, మైక్రో ప్లాస్టిక్ టీలో కరిగిపోతున్నాయి. దీనివల్ల ఆ టీని తాగే సాధారణ ప్రజలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ తీవ్రమైన ఆరోగ్య సమస్యపై స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఫిర్యాదులు అందిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, కనీసం టీ దుకాణాల్లో తనిఖీలు కూడా చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛత మరియు ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాల్సిన మున్సిపల్ యంత్రాంగం, ఇంత పెద్ద ముప్పు పొంచి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హోటళ్లకు, టీ స్టాల్లో ప్లాస్టిక్ జాలీల స్థానంలో కేవలం స్టీల్ లేదా బట్టతో చేసిన వడపోత సాధనాలను మాత్రమే వాడేలా అధికారులు కఠిన నిబంధనలు అమలు చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్లాస్టిక్ జాలీలు వాడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

# జూలై 20 నుంచి డిగ్రీ ప్రత్యేక విడత అడ్మిషన్లు

బెల్లంపల్లి, జూలై 17 విజన్ ఆంధ్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రత్యేక విడత అడ్మిషన్లు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు, 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 30న సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కళాశాలలో దోస్త్ వాలంటరీ హెల్ప్‌లైన్ కేంద్రం అందుబాటులో ఉందని, విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ అవకాశాలకు అనుసంధానంగా ఐదు ఏఈడీపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొదటి రెండు సంవత్సరాలు కళాశాలలో బోధన, చివరి ఏడాది స్టైఫండ్‌తో కూడిన ఉద్యోగ సంబంధిత శిక్షణ అందిస్తామని చెప్పారు. బీఏ ఆనర్స్, బీకాం (బీఎఫ్ఎస్ఐ), బీకాం ఈ-కామర్స్, బీఎస్సీ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్, బీఎస్సీ హార్టికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్‌తో పాటు బీఏ, బీకాం, బీఎస్సీ తదితర సాధారణ డిగ్రీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 99592 69975 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## సాయిబాబా నగర్‌లో కాంగ్రెస్ నూతన కార్యాలయం ప్రారంభం

**కార్యకర్తలే పార్టీ బలోపేతానికి వెన్నెముక: హన్మంత్ రెడ్డి**

**భారీ సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు**

కుత్బుల్లాపూర్, జులై 17 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 292 డివిజన్ సాయిబాబా నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరి కిరణ్ పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయ ప్రారంభోత్సవంలో హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు కేవలం రాజకీయ కార్యక్రమాల నిర్వహణకే పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ కార్యకర్తలకు మార్గనిర్దేశం చేసే సేవా కేంద్రాలుగా పనిచేయాలని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# ఓటు నమోదే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది

**సూరారంలో వినూత్న చైతన్య యాత్రతో ప్రజలను ఆకట్టుకున్న కోల రవీందర్ ముదిరాజ్**

**మైకింగ్ ద్వారా కూడళ్లలో మారుమోగిన ఓటు హక్కు సందేశం**

**యువత, మహిళలు, సీనియర్ సిటిజన్లతో చైతన్య ర్యాలీ**

**ప్రజల ప్రశంసలు అందుకున్న సామాజిక సేవా కార్యక్రమం**

**ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని పిలుపు**



కుత్బుల్లాపూర్, జూలై 17 (విజన్ ఆంధ్ర): ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలని సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సూరారం కాలనీ, బస్‌స్టాప్, ఫస్ట్ హోమ్ జెండా, సెకండ్ హోమ్ జెండా, సూరారం ఎక్స్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసే అవకాశాలు ఉండవచ్చని, అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంట్లో ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారానే కుటుంబ సభ్యుల సహాయంతో సులభంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని వివరించారు. ప్రచారంలో భాగంగా స్వయంగా కాటన్ వస్త్రంపై స్కెచ్‌పెన్‌తో సందేశాలు రాసి బ్యానర్లు తయారు చేయడంతో పాటు, సొంతంగా రికార్డు చేసిన సందేశాలను మైకింగ్ ద్వారా ప్రధాన కూడళ్లలో ప్రసారం చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. పాఠశాల విద్యార్థులకు సైతం ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ, తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ఈ చైతన్య ర్యాలీలో 60 గజాల శ్యామ్, గుట్ట అశోక్, ఆర్. లక్ష్మీనారాయణ, జి. రమేష్, రాజు, ఆంజనేయులు, దేవిరెడ్డి తదితరులతో పాటు పలువురు యువకులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు. వినూత్నంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం విశేషంగా నిలిచింది

## నాచారంలో కాంగ్రెస్ బిఎల్ఏ సూపర్‌వైజర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బడితల రాజయ్య

మల్లూర్, జూలై 17 విజన్ ఆంధ్ర : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బడితల రాజయ్య సూచించారు. శుక్రవారం నాచారంలో జరిగిన బిఎల్ఏ, సూపర్‌వైజర్ల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటిని సందర్శించి, పొరపాట్లు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని పార్టీ శ్రేణులంతా పూర్తి సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుటి లావణ్య దేవేందర్, వార్డు సభ్యులు సంపత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో ఏకరూప దుస్తుల పంపిణీ



పరిగి, జూలై 17(విజన్ ఆంధ్ర ): దోమ మండలం కొత్తపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం విద్యార్థులకు సర్పంచ్ సుగుణ సుందరి చిన్నయ్య ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకునే పిల్లలు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, టీవీ, సెల్‌సెన్‌కు దూరంగా ఉంచి విద్యపై మక్కువ పెంచాలని అప్పుడే పిల్లలు చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉన్నతంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని అంగన్వాడీ టీచర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డులో సభ్యులు దొబ్బలి చెన్నయ్య, బొంగు చిన్న బుగ్గయ్య, పంచాయతీ కార్యదర్శి అరుణ, అంగన్వాడీ టీచర్ రేష్మ బేగం, ఆయా, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# గిరిజన బిడ్డకు ఏఎస్ఐ పదోన్నతి

**సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్ అభినందనలు**

హుస్నాబాద్, జూలై 17: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పెద్దతండాకు చెందిన గుగులోతు మొగిలి నాయక్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)గా పదోన్నతి పొందారు. సాధారణ గిరిజన రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన స్వయంకృషి, పట్టుదలతో ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదిగి ఈ పదోన్నతిని సాధించడం విశేషం. ప్రస్తుతం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మొగిలి నాయక్‌ను శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసినప్పుడే పోలీసు ఉద్యోగానికి మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఐగా పదోన్నతి పొందిన మొగిలి నాయక్ మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొని రైతు కుటుంబం నుంచి ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పదోన్నతితో తనపై మరింత బాధ్యత పెరిగిందని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నిజాయితీగా విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

# ఒక్క అక్రమానికి మౌనం... వంద అక్రమాలకు ఆహ్వానమా?"

**ఆరు నెలలుగా అనుమతుల్లేని వెంచర్ పనులు**

**ప్రజావాణి ఫిర్యాదులు, వార్తా కథనాలు.**

**ఎమ్మెల్యే ఫిర్యాదు చేసిన పట్టించుకోరా..**

**తనిఖీలకే పంచాయతీ అధికారులు అధికారులు పరిమితమా..?**

కొండాపూర్ విజన్ ఆంధ్ర జూలై 17 : మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 158/ఈలో ఎలాంటి అనుమతులు లేకుండా ఆరు నెలలుగా కొనసాగుతున్న వెంచర్ నిర్మాణాలపై అధికార యంత్రాంగం ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రారంభం నుంచే అనుమతులు లేవంటూ వరుసగా వార్తా కథనాలు వెలువడినా, ప్రజావాణిలో ఫిర్యాదులు అందినా, స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా నిర్మాణాలు మాత్రం నిరంతరాయంగా కొనసాగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వెంచర్‌లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాల ఏర్పాటు పూర్తికాగా, ప్రహరీ గోడ, ప్రధాన ద్వారం నిర్మించి ప్లాట్ల విక్రయాలు, ఇండ్ల నిర్మాణాలు కూడా కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామపంచాయతీ నుంచి ఒక ఇంటి నిర్మాణానికి



10 శాతం భూమి, అవసరమైన అనుమతులు లేకుండానే పనులు సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

జూలై 1న జిల్లా పంచాయతీ అధికారి మల్లారెడ్డి అధికార బృందంతో కలిసి వెంచర్‌ను పరిశీలించి అక్రమ నిర్మాణాలు కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ, అనంతరం పనులు యథావిధిగా కొనసాగడం ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తోంది. రాజకీయ ఒత్తిళ్లు, పలుకుబడి కారణంగానే చర్యలు ఆలస్యమవుతున్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

"పేదలు చిన్న నిర్మాణం చేసినా వెంటనే నోటీసులు, కూల్చివేతలు జరుగుతాయి. మరి భారీ వెంచర్లు అనుమతులు లేకుండా నెలల తరబడి కొనసాగినా ఎందుకు చర్యలు లేవు? పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయమా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అనుమతులు లేకుండా వెంచర్లు అభివృద్ధి చెందడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, ఇతర ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని, ఒక అక్రమాన్ని ఉపేక్షిస్తే దానిని చూసి మరిన్ని అక్రమాలు జరిగే అవకాశాలు పెరుగుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చట్టాలను అమలు చేయాల్సిన వారే అక్రమాలను ప్రోత్సహిస్తున్నారనే భావన కలిగితే వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని అభిప్రాయపడుతున్నారు.

జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా విచారణ జరిపించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అక్రమ వెంచర్లకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. తనిఖీలతోనే సరిపెడతారా..? చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించేలా కఠిన చర్యలు తీసుకుంటారా..? అనే ప్రశ్నకు అధికార యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని స్థానికులు పేర్కొంటున్నారు.

"అక్రమం ఒక్కటే కాదు... దానికి మౌనం మరింత ప్రమాదం"

ఒక అక్రమాన్ని ఉపేక్షిస్తే అదే మరిన్ని అక్రమాలకు మార్గం చూపుతుంది. చట్టం అందరికీ సమానంగా అమలైతేనే ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. అక్రమ వెంచర్లపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య...



పాపన్నపేట, విజన్ ఆంధ్ర, జూలై 17; మనస్థాపంతో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అర్కెల గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు... గ్రామానికి చెందిన చిట్యాల ఉదయ్ కుమార్(23) కూలీ పనులు చేసుకుంటూ హైదరాబాద్ లో ఉంటున్నారు. అక్కడ ఉన్న సమయంలో పటాన్ చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన రాధను ప్రేమ వివాహం చేసుకున్నాడు. గత కొన్ని నెలలుగా దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య తన పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో అప్పటి నుంచి అతను గ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఈనెల 15న భార్యను కాపురానికి రమ్మని పిలవడానికి వెళ్లగా ఆమె కాపురానికి రాను అని నిరాకరించింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఉదయ్ కుమార్ గురువారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత..

**- ఏసీపీ నర్సింహులు**

కుకునూరుపల్లి, జులై 17,విజన్ ఆంధ్ర :పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, స్టేషన్ పరిసరాలల్లో 30రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మొక్కలను పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. చుట్టూ ఉండే పరిసరాలు పచ్చగుంటేనే ప్రజలు స్వచ్ఛమైన వాతావరణంలో జీవించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై బాలకృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**- కాంగ్రెస్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షులు కొండల్ రెడ్డి**



గజ్వేల్, 17 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై ఇటీవల సోషల్ మీడియా వేదికగా కొంతమంది చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను, దుష్ప్రచారాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొండల్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నాడు గజ్వేల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజా నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న నర్సారెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే కొందరు ఇటువంటి నీచమైన ప్రచారాలకు ఒడిగడుతున్నారన్నారు. నర్సారెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా, కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూర్చేలా కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. నర్సారెడ్డిని విమర్శించే స్థాయి గానీ, అర్హత గానీ ఆ వ్యక్తులకు లేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో నర్సారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని, ఆయన సారథ్యంలో క్యాడర్ అంతా సంఘటితంగా ముందుకు సాగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చీలికలు తేవాలని చూస్తున్న పార్టీల నాయకులు, శ్రేణులు తమ కుయుక్తులను తక్షణమే మానుకోవాలని, ఇటువంటి చౌకబారు ప్రయత్నాలు గజ్వేల్‌లో సాగవని హెచ్చరించారు. నర్సారెడ్డిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కార్యకర్తలు ఎవరూ ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్స్ ,సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడికి నిలిచిపోయిన వేతనం ఇప్పించిన బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు రవి

**జీడిమెట్ల పరిశ్రమలో కార్మికుడికి న్యాయం**

**మే నెల వేతనం చెల్లించేలా యాజమాన్యంతో చర్చలు**

**కార్యక్రమంలో పాల్గొన్న పలువురు కార్మిక ప్రతినిధు..**




జీడిమెట్ల, జూలై 17 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల పరిశ్రమల ప్రాంతంలో ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేసిన సంజయ్ కుమార్‌కు రావాల్సిన మే నెల వేతనాన్ని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి చొరవతో యాజమాన్యం చెల్లించింది. సంజయ్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా సంబంధిత కంపెనీలో విధులు నిర్వర్తించారు. వ్యక్తిగత అనివార్య కారణాలతో ఉద్యోగం విరమించుకున్న అనంతరం ఆయనకు రావాల్సిన మే నెల వేతనాన్ని సంస్థ యాజమాన్యం చెల్లించకుండా పలుమార్లు తిప్పిపంపినట్లు సమాచారం. పలుమార్లు యాజమాన్యాన్ని సంప్రదించినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో తోటి కార్మికుల సూచన మేరకు బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిని కలిసి తన గోడును వివరించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన రవి నేరుగా సంబంధిత కంపెనీ యాజమాన్యాన్ని కలిసి కార్మికుడికి రావాల్సిన వేతనాన్ని వెంటనే చెల్లించేలా చర్చలు జరిపారు. దీంతో యాజమాన్యం సంజయ్ కుమార్‌కు పెండింగ్‌లో ఉన్న మే నెల వేతనాన్ని చెల్లించింది. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ, తనకు, తన కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేసిన బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఇటువంటి సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, సుదర్శన్, జగన్, మోజెస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు మా హక్కు సాధించేదాకా పోరాటం చేస్తాం

గజ్వేల్, 17 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : కాళేశ్వరం కన్నేపల్లి వద్ద బాహుబలి పంపులను వెంటనే స్టార్ట్ చేసి మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్ రంగనాయక సాగర్ లాంటి రిజర్వాయర్లలో ప్రాజెక్టులలో గోదావరి జలాలను నింపి రిజర్వాయర్ కింద కెనాల్స్, హల్దీ వాగు కూడవెల్లి వాగు, సంగారెడ్డి కెనాల్ రామారెడ్డి కెనాల్ కామారెడ్డి కెనాల్ బస్వాపూర్ కెనాల్ లోకి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కొండపోచమ్మ సాగర్ వద్ద రైతులతో కలిసి, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో నిరసన కార్యక్రమం, మహా ధర్నా నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగాన్ని కాంగ్రెస్ అసమర్థ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ప్రతిరోజు లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు సముద్రం పాలవుతున్న రైతులకు సాగునీరు అందించకుండా నిర్లక్ష్యం చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ సుందిళ్ల అన్నారం బ్యారేజీ నుంచి ఎల్లంపల్లి గుడ్ మార్నింగ్ రంగనాయక సాగర్ మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని తరలించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో జలకళతో కలకలలాడే రిజర్వాయర్లు నేడు నీటి కొరతతో ఎడారులుగా మారి వెలవెల పోతున్నాయని దీంతో యాసంగి వానాకాలం పంటలకు సాగునీరు అందక రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు, తాగునీటి సమస్యలు కూడా రోజురోజుకు తీవ్రమవుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించక పోవడం చాలా బాధాకరమన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతులకు శాశ్వత ప్రయోజనాల కోసం నిర్మించిన ప్రాజెక్టులను ప్రస్తుత అసమర్థ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, రైతులు బతుకుతేనే రాష్ట్రం బతుకుతుంది కొండపోచమ్మ మల్లన్న సాగర్ నింపాలి రైతులను కాపాడాలి అన్నారు సాగునీరు మా హక్కు అని సాధించలేక పోరాటం ఆగదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం పడుతున్న కష్టాన్ని చూసి, రైతులు కోటీశ్వరులు కావాలి, ఆత్మహత్యలు లేని తెలంగాణ కావాలని, ఎడారిగా ఉన్న తెలంగాణ భూములు పాడిపంటలతో పచ్చగా మారాలని గతంలో కేసీఆర్ ప్రభుత్వం అనేక రకాల ప్రాజెక్టుల నిర్మాణం చేసి, మండుటెండల్లో సైతం సాగునీరు అందించి, రైతన్న గానికి అనేక రకాల రైతుబంధు రైతు బీమా 24 గంటల కరెంటు లాంటి అనేక రకాల రతకాలను రైతాంగానికి ఇచ్చి రైతులను రాజులుగా చేస్తే నేడు అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన రేవంత్ రెడ్డి దుర్మార్గపు ప్రభుత్వం రైతులను బిచ్చగాళ్లను చేస్తుందని మండిపడ్డారు. కాళేశ్వరం వద్ద కక్షతో బాంబులు పెట్టి బ్లాస్ట్ చేసి పిల్లర్లు కృంగినాయని పిట్టకథలు చెప్పి రైతులకు సాగునీరు అందించక, ప్రాజెక్టులను నింపక డైవర్ట్ రాజకీయాలతో కాలయాపన చేస్తూ రాజకీయ లబ్ది పొందుతున్న అసమర్థ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని మండిపడ్డారు. చేతగాని అసమర్థ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పుకోవాలని, బిఆర్ఎస్ పార్టీ మేడిగడ్డ వద్ద కన్నెపల్లి బాహుబలి పంపులను స్టార్ట్ చేసి రైతాంగానికి సాగునీరు అందించి రైతుల పొలాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. వెంటనే కన్నెపల్లి పంపులను స్టార్ట్ చేసి మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్ రంగనాయక సాగర్ లాంటి రిజర్వాయర్ల నింపి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులను తిరగనివ్వమని, ఎమ్మెల్యేల మంత్రుల పర్యటనలను రైతులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు తదితరులున్నారు.



## ఇస్కాన్ కార్యక్రమాలతో హిందువుల్లో ఐక్యత..

**- రథయాత్రను ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**

నిజామాబాద్ జులై17 :( విజన్ ఆంధ్ర ) ఇస్కాన్ చేపడుతున్న కార్యక్రమాలతో హిందువుల్లో ఐక్యత పెరుగుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. నిజామాబాద్ ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాధుని రథయాత్రను శుక్రవారం నగరంలోని గంజి కమాన్ వద్ద ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాలుగా నిజామాబాద్ ఇస్కాన్ నగరంలో రథయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. వారం రోజులపాటు జగన్నాథుడు, సుభద్రాదేవి, బలరామకృష్ణుడి ప్రతిమల మండపాన్ని ఏర్పాటు చేసి పూజించడం సంతోషకరమన్నారు. ప్రతి సంవత్సరం ఇస్కాన్ సేవలు ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల బోధన్ లో ఇస్కాన్ ఆలయాన్ని నిర్మించడానికి స్థల సేకరణ జరిగిందని గుర్తు చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోనూ పెద్ద ఆలయం నిర్మించేలా కృషి చేయాలన్నారు. హనుమాన్ జయంతి గణేష్ నిమజ్జనం తర్వాత ఇస్కాన్ రథయాత్రకు ఆదరణ పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, నిజామాబాద్ ఇస్కాన్ అధ్యక్షులు సిద్ధ బలరామయ్య, కార్పొరేటర్ లు బంటు ప్రీతి ప్రవీణ్, నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, పసునూరి రాము, ప్రసూన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మందమర్రి, జులై 17 (విజన్ ఆంధ్ర) : ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3,19 వార్డులలో కొనసాగుతున్న సర్ ప్రక్రియను కలెక్టర్ కుమార్ దీపక్,మందమర్రి తహసిల్దార్ సతీష్ కుమార్ పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారాలలో నింపిన ఓటర్ల వివరాలను బిఎల్ఓ యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అదనపు గదులు,భోజనశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించి నాణ్యమైన విద్య అందిస్తామని పేర్కొన్నారు.

# బీటలువారిన నేల... పెద్దమ్మ తల్లి సన్నిధిలో జలాభిషేకం

**అన్నదాత కళ్లలో కన్నీరు కాదు...**

**- పొలాల్లో వర్షపు నీరు కనిపించే రోజులు రావాలనీ**

**- మర్పల్లి మహిళలు పెద్దమ్మ తల్లి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు."**

మర్పల్లి, జూలై 17 (విజన్ ఆంధ్ర): వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలో వర్షాభావ పరిస్థితులు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చడంతో అన్నదాతల ఆవేదన తారాస్థాయికి చేరుకుంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఎంతో ఆశతో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న తదితర పంటలు కొన్నిచోట్ల మొలకెత్తకపోగా, ఇప్పటికే మొలకెత్తిన మొక్కలు కూడా ఎండ తీవ్రతకు నేలవాలుతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మర్పల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో గ్రామ మహిళలు సంప్రదాయ పద్ధతిలో జలాభిషేకం నిర్వహించి వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నీటి బిందెలలో నీటిని తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేస్తూ, "అమ్మా... వరుణుడిని కరుణింపజేయి... సమృద్ధిగా వర్షాలు కురిపించి రైతుల కష్టాలు తీర్చు" అంటూ భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు.

మహిళలు మాట్లాడుతూ, రైతు జీవితమంతా వ్యవసాయంపైనే ఆధారపడి ఉంటుందని, వరుసగా వర్షాలు లేకపోవడంతో రైతు



కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం చేసిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు.

"ఇకనైనా వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలి... పొలాలు పచ్చదనంతో కళకళలాడాలి... పంటలు సమృద్ధిగా పండాలి... రైతు ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలి" అని పెద్దమ్మ తల్లిని వేడుకుంటూ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.జిల్లాలో ఇప్పటికే అనేక గ్రామాల్లో వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతుండగా, వర్షాల కోసం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు నిర్వహించడం గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తున్న పరిస్థితులకు నిదర్శనంగా నిలుస్తోంది. రైతుల ఆవేదనను అర్థం చేసుకొని ప్రకృతి కరుణించాలని, వరుణుడు ప్రసన్నమై త్వరలోనే విస్తారంగా వర్షాలు కురిపించాలని గ్రామస్థులు, మహిళలు హృదయపూర్వకంగా ప్రార్థించారు.

## 30 మంది అనుచరులతో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరిన నీరుడు ఆంజనేయులు

**-మల్కాపూర్ లో కాంగ్రెస్ పార్టీకి షాక్**

**-కాండవ కప్పి పార్టీలోకి ఆహ్వానించిన తీన్మార్ మల్లన్న**

కొండాపూర్ విజన్ ఆంధ్ర జూలై 17 : మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి జగ్గారెడ్డి అనుచరుడిగా గుర్తింపు పొందిన నీరడు ఆంజనేయులు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.తనతో పాటు సుమారు 30 మంది అనుచరులతో కలిసి టీఆర్పీలో చేరారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మన్నే రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు రవి నాయక్ ఆధ్వర్యంలో పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా నీరడు ఆంజనేయులు మాట్లాడుతూ బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ వర్గాలకు రాజకీయ అధికారం సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న తీన్మార్ మల్లన్న నాయకత్వాన్ని బలపర్చేందుకే టీఆర్పీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి జిల్లాలో కృషి చేస్తామని చెప్పారు. అగ్రవర్ణాల పార్టీలో ఎన్ని రోజులు ఉన్నా కూడా ఆ పార్టీలు బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకు గానే



చూస్తున్నాయని రాజకీయ అధికారం ఇవ్వడం ఆ పార్టీలకు ఇష్టం లేదని అందుకే ఆ పార్టీలను కాదని తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరినట్లు తెలిపారు.

**తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ**

రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు.సామాజిక న్యాయం సాధనకు పార్టీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.పార్టీలో సుధాకర్,ముత్యాలు, చంద్రక్, సుధాకర్, ఎండి ఆజీ,నరేష్,శాంతి కుమార్ లు చేరారు.

# అన్నదాతల కళ్లలో వెలుగులు

**- తాలిపేరు ప్రాజెక్టు నుంచి రైతు పంటలకు సాగునీరు**

**- అధికారికంగా విడుదల చేసిన భద్రాచలం శాసనసభ సభ్యులు తెల్లం వెంకట్రావు**

చర్ల, జులై 17 (విజన్ ఆంధ్ర): చర్ల మరియు దుమ్ముగూడెం మండలాల్లోని రైతాంగానికి శుభవార్త అందింది. చిరకాలంగా ఎదురుచూస్తున్న సాగునీటి అవసరాలను తీర్చేందుకు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి అధికారులు సాగునీటిని అధికారికంగా విడుదల చేశారు,భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్వయంగా ప్రాజెక్టు వద్దకు చేరుకుని, పూజా కార్యక్రమాలు చేసి, తాలిపేరు ప్రాజెక్టు కుడి మరియు ఎడమ కాలువ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు

ప్రాజెక్టు ప్రాముఖ్యత

గోదావరి నదికి ఉపనదిగా ఉన్న తాలిపేరుపై పెదమిడిసిలేరు గ్రామం వద్ద నిర్మించిన ఈ మధ్యతరహా ప్రాజెక్టు, సుమారు 24,500 ఎకరాల ఆయకట్టుకు జీవనాధారంగా నిలుస్తోంది. 5.0 టి ఎం సి సామర్థ్యం



కలిగిన ఈ ప్రాజెక్టు నిండుకుంటే రైతులు పంటల సాగులో ఎటువంటి కొరత ఎదుర్కోరు, ఎగువ నుంచి వచ్చే నీటిని సద్వినియోగం చేస్తూ, అదనపు వరద సమయాల్లో అప్రమత్తంగా ఉండి నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు అధికారులు వివరించారు

**రైతుల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే**

సాగునీటి విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, వ్యవసాయమే ఈ ప్రాంత ప్రజల ప్రధాన జీవనాధారం. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకూడదన్నదే మా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం, సకాలంలో సాగునీరు అందించడం ద్వారానే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చగలం, నాటి నుంచి నేటి వరకు రైతుల సమస్యలను పరిష్కరించడం మా బాధ్యతనీ, ఈ నీటిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని, పంటలను సమృద్ధిగా పండించి ఆర్థికంగా ఎదగాలని కోరుకుంటున్నాననీ. ప్రభుత్వం ఎప్పుడూ మీ వెంటే ఉంటుంది అని భరోసానిచ్చారు

ఈ కార్యక్రమంలో తాలిపేరు ప్రాజెక్టు అధికారులు ఎస్ ఈ మహేశ్వరరావు, ఈ ఈ సయ్యద్ అహ్మద్ జానీ, డి ఈ ఈ లు తిరుపతి. జే, భాగ్యరాజు రాథోడ్, ఏ ఈ ఈ సంపత్ బి, ఎల్. సూర్యం , చర్ల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు సీనియర్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి , లంక రాజు ,సీతాపతి రాజు , కాంగ్రెస్ పార్టీ నాయకులు,మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు

# పోటీ పరీక్షలతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యం:

## ప్రిన్సిపాల్ డా. కాంచనలత

చేవెళ్ల, జూలై 17 (విజన్ ఆంధ్ర): విద్యార్థులు డిగ్రీతోనే ఆగిపోకుండా పోటీ పరీక్షలకు లక్ష్యంగా సిద్ధమై ఉన్నత స్థాయికి చేరాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్. కాంచనలత అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షలపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... ఉపన్యాసాలను సద్వినియోగం చేసుకుని స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్‌బాబు మాట్లాడుతూ... నేటి పరిస్థితుల్లో విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు, క్రమశిక్షణ కూడా విజయానికి కీలకమని పేర్కొన్నారు. ప్రత్యేక వక్త ప్రొఫెసర్ ఎం.ఏ. మాలిక్ మాట్లాడుతూ... యూపీఎస్సీ, టీజీపీఎస్సీ, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ తదితర ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ఆంగ్ల భాషపై పట్టు, కంప్యూటర్ నైపుణ్యాలు అవసరమని వివరించారు. నిరంతర సాధన, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన సాధ్యమని విద్యార్థులకు సూచించారు.

# ఎమ్మెల్యే మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

## ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు లింగన్నగౌడ్, వెంకట్

జన్నారం, జులై 17 (విజన్ ఆంధ్ర) : ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను ఉపసం హరించుకోవాలని జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధా నకార్యదర్శులు గాజుల లింగన్న గౌడ్, జాడి వెంకటేష్ లు అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ టి న్యూస్ ఛానెల్ ను ఉద్దేశించి మాట్లాడుతూ టి న్యూస్ ఛానెల్ ఒక తాగుబోతు ఛానెల్ అని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసి నందుకుగాను శుక్రవారం రోజున జన్నారం ప్రెస్ క్ల బ్ ఆధ్వర్యంలో ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందర నిరసన తెలిపి తహసీల్దార్ బక్కయ్యకు వినతిపత్రాన్ని సమర్పిం చారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధానకా ర్యదర్శులు గాజుల లింగన్న గౌడ్, జాడి వెంకటేష్ లు మాట్లాడుతూ బాధ్యత గల ఎమ్మెల్యే పదవిలో ఉన్న బొజ్జు పటేల్ టి న్యూస్ ఛానెల్ ను కించపరి చే విధంగా మాట్లాడటం సరికాదని వెంటనే ఆయ న మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహ రించుకోవాలని ప్రెస్ క్లబ్ తరుపున డిమాండ్



చేస్తు న్నట్లు తెలిపారు. లేని యెడల మండలం నుండి జిల్లా, రాష్ట్రం వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు చిలువేరి నర్సయ్య, సతీష్, మ ల్లేశం, కొండపల్లి ప్రశాంత్, కాంతయ్య, సత్యనారా యణ, కొత్త వేణుగోపాల్, గొనె సత్యం,తాటి శ్రీని వాస్, రమేష్, మహేష్, అజ్మత్, శివ, శంకర్, భాస్క ర్, రాజేందర్, తిరుపతి, సతీష్, వెంకపని రాజు, పవన్ లతో పాటు వివిధ చానెల్ ల స్టాఫ్ రిపోర్టర్లు పలు మండలాల రిపోర్టర్లు పాల్గొన్నారు.

# సిసి రోడ్లు మరియు ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవము చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లింగాల గణపురం జూన్ 17(విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలోని సిరిపురం గ్రామానికి సిసి రోడ్లు మరియు ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన కడియం శ్రీహరి , ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి నేటి వరకు, గ్రామానికి, 42 లక్షల సిసి రోడ్లు మంజూరు చేశానని, అలాగే మహిళా సంఘం భవనం 10 లక్షల రూపాయలు, గౌడ కమ్యూనిటీ హాల్ కు 10 లక్షల రూపాయలు, 20 ఇందిరమ్మ ఇండ్లు, మంజూరు చేశానని, అలాగే , సర్పంచ్ సంపత్‌లి అడిగిన, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనంతో పాటు, మరొక 20 లక్షల సిసి రోడ్లు, గౌడ సంఘం భవనానికి మరొక్క పది లక్షల రూపాయలు ఇస్తానని అది మొత్తం పూర్తి చేస్తానని, మరొక 20 ఇందిర మైండ్లను రెండో విడతలో మంజూరు చేస్తానని, గౌరవ ఎమ్మెల్యే గారు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో, మండల, సర్పంచులు, నాయకులు జిల్లా నాయకులు గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రజలు తదితరులు

# లూనాను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం.. వృద్ధుడు మృతి

**- మృతుడి వద్ద ఉన్న రూ.12.27 లక్షల నగదును పోలీసులకు అప్పగించిన హైవే పట్రోలింగ్ సిబ్బంది**

చౌటకూర్, జూలై 17 (విజన్ ఆంధ్ర): సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని 161వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. జోగిపేట నుంచి సంగారెడ్డి వైపు లూనాపై వెళ్తున్న కొండాపూర్ గ్రామానికి చెందిన నరసింహ గౌడ్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.మృతుడు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారిక వాహన డ్రైవర్ అశోక్ గౌడ్ తండ్రి అని సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న పుల్కల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో హైవే పట్రోలింగ్ సిబ్బంది చూపిన నిజాయితీ అందరి ప్రశంసలు అందుకుంది. మృతుడి వద్ద ఉన్న రూ. 12.27 లక్షల నగదును హైవే పట్రోలింగ్ సిబ్బంది మనోజ్, శ్రావణ్, బాలరాజు, సాయి, బాలమణి గుర్తించి ఎలాంటి అపోహలకు తావులేకుండా పోలీసులకు అప్పగించారు. వారి నిజాయితీని పోలీసులు, స్థానిక ప్రజలు అభినందించారు. ఈ విషాద ఘటనతో కొండాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ విచారణ కొనసాగిస్తున్నారు.

# గూడెప్పపల్లెలో నూతన తాగునీటి బోరుబావి ప్రారంభం

**కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన వార్డు సభ్యులు పమ్మడి నిరంజన్ రావు- తీరనున్న స్థానికుల తాగునీటి కష్టాలు.. మంత్రికి కృతజ్ఞతలు**

మల్హర్, జూలై 17 విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన తాడిచర్ల పరిధిలోని గూడెప్పపల్లెలో తాగునీటి ఎద్దడి నివారణకు నూతన బోరుబావి నిర్మాణ పనులు గురువారం వేగంగా ప్రారంభమయ్యాయి. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక ఆదేశాల మేరకు.. డిఎంఎఫ్టీ నిధులు రూ. 3 లక్షల 42 వేల వ్యయంతో ఈ బోరుబావి మంజూరైంది. ఈ నిర్మాణ పనులను వార్డు సభ్యులు పమ్మడి నిరంజన్ రావు కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పమ్మడి నిరంజన్ రావు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి, సకాలంలో స్పందించి నిధులు కేటాయించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తక్కువ నీటితో పండే పంటలనే సాగు చేయాలి

## సహాయ వ్యవసాయ సంచాలకులు అరుణ.

పరిగి, జూలై 17(విజన్ ఆంధ్ర ): ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు అప్రమత్తమై వరికి బదులుగా తక్కువ నీటితో పండే పంటలనే సాగు చేయాలని పరిగి సహాయ వ్యవసాయ సంచాలకులు అరుణ పేర్కొన్నారు. శుక్రవారం పరిగి మండల పరిధిలోని చిగురాల్ పల్లి గ్రామంలోని రైతులతో కలిసి వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల ద్వారా నష్టాల నుంచి బయటపడాలని రైతులకు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గి పంటలు నీటి ఎద్దడికి (తేమ ఒత్తిడి) గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రైతులు తీవ్ర నష్టాల బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు మరియు ప్రత్యామ్నాయ పంటల యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. పత్తి, మొక్కజొన్న, కంది వంటి సున్నితమైన పంటలు వర్షాభావ పరిస్థితుల వల్ల వాడిపోకుండా మరియు తేమ ఒత్తిడిని తట్టుకోవడానికి లీటరు



నీటికి 20 గ్రాముల యూరియాను కలిపి పంటలపై పిచికారీ చేయడం వల్ల మొక్కలకు నత్రజని అంది, తేమ లేమిని తట్టుకునే శక్తి పెరుగుతుంది, అదేవిధంగా లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేయడం వల్ల మొక్కలలో నీటి నియంత్రణను మెరుగుపరిచి, ఆకులు ఎండిపోకుండా కాపాడుతుందన్నారు. లీటరు నీటికి 5-10 గ్రాముల 19:19:19 ఎరువును కలిపి పిచికారీ చేయడం ద్వారా పంటలకు అవసరమైన ప్రధాన పోషకాలు తక్షణమే అందుతాయి కావున రైతులు పైన తెలిపిన వాటిని ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేస్తే మందులు ఆకులపై ఎక్కువ సమయం ఉండి, మొక్కలకు గరిష్ట ప్రయోజనం చేకూరుతుందన్నారు.

వరి సాగు తగ్గించండి -- ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోండి: మండల వ్యవసాయ అధికారి రజిత.

ఎల్ నినో పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు మరియు జలాశయాలలో నీటి మట్టాలు వేగంగా తగ్గే అవకాశం ఉంది కాబట్టి రైతులు భారీ పెట్టుబడులు పెట్టి వరి (ప్యాడీ) సాగు చేయడం వల్ల నష్టపోయే ప్రమాదం ఉంది కావున తగినంత నీటి వసతి లేని ప్రాంతాల్లో వరి సాగును తగ్గించి వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలైన కంది (రెడ్‌గ్రామ్), మొక్కజొన్న, జొన్నలు లేదా సజ్జలు వంటి పంటలను సాగు చేసుకోవడం ద్వారా వాతావరణ హెచ్చుతగ్గుల వల్ల వచ్చే నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఎల్ నినో పరిస్థితులు వ్యవసాయానికి సవాలుగా మారినప్పటికీ, శాస్త్రీయ పద్ధతులు మరియు సమయానుకూల పోషక పిచికారీ ద్వారా మనం పంటలను కాపాడుకోవచ్చని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరిగి సహాయ వ్యవసాయ సంచాలకులు అరుణ, మండల వ్యవసాయ అధికారి రజిత, వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటు హక్కును ప్రతి ఒక్కరు కలిగి ఉండాలి

ముధోల్:17జూలై:విజన్ ఆంధ్ర : అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు ను కలిగి ఉండాలని ముధోల్ తహ సిల్దార్ శ్రీలత అన్నారు. శు క్రవారం మండలంలోని రువ్వి గ్రామపం చాయతీ కార్యాలయంలో కొనసా గుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను ఆమె పరిశీలించి మాట్లాడారు. సర్ ప్రక్రియను 100 శాతం పూర్తయ్యే విధంగా చూడాలని బిఎల్ఓలకు సూచించారు. ఓటు ప్రజాస్వామ్యం లో ఆయుధంలాంటిదన్నారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ పై ఉప సర్పంచ్ సర్దార్ కునాల్ ఆధ్వర్యం లో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిజేఎస్ నియోజకవర్గ ఇంచార్జీ సర్దార్ వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, జిపిఓ లక్ష్మి, బిఎల్ శోభ తదితరులు పాల్గొన్నారు

## ఉప్పరిగూడలో ఉచిత వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం, జూలై 17 (విజన్ ఆంధ్ర ): ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడలో బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సాయికీర్తన్ రెడ్డి లెగసీ ట్రస్ట్ నిర్వహణలో భాగంగా శుక్రవారం బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పయనీర్, రక్ష్ కేర్, సాధురం కంటి ఆస్పత్రుల సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ... పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలు సంపూర్ణ ఆరోగ్యంతో బాగుండాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తమ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. అనంతరం కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆస్పత్రుల వైద్యులు, ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

## నవోదయ,సైనిక్ స్కూల్ లను మంజూరు చేయాలని వినతి



ముధోల్:17జూలై:విజన్ ఆంధ్ర : నవోదయ,సైనిక్ స్కూల్ లను నిర్మల్ జిల్లాలో మంజూరు చేయాలని జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్నకు శుక్రవారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్, స్టేట్ కన్వీనర్ గాడేకర్ మహేశ్వర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలో సైనిక్, నవోదయ స్కూల్ లను మంజూరు చేసినట్లయితే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉ ంటుందన్నారు. అదేవిధంగా ముధోల్ ఎస్సీ బాలికల హాస్టల్ అద్దె భవనంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే నూతన భవనాన్ని మంజూరు చేయాలన్నారు. ముధోల్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు మేనేజ్మెంట్ ఎస్సీ హాస్టల్ ఏర్పాటు చేసినట్లయితే విద్యార్థులకు దూర భారం తగ్గుతుందని కోరారు. ఈ సందర్భంగా డి ఈవో సానుకూలంగా స్పందించి మంజూరయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# సిడాం శంభు పటేల్ స్మారక సభను విజయవంతం చేయాలి

### - ఆదివాసీ తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పెందోర్ దాదిరావ్ పిలుపు



నార్నూర్, జులై 17(విజన్ ఆంధ్ర): తొలి తరం ఆదివాసి ఉద్యమ నేత తుడుం దెబ్బ వ్యవస్థాపకులు స్వర్గీయ సిడం శంభు ఏనిమిదవ వర్ధంతి ఈనెల 20న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని మత్తడి గూడ లో నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తుడుం దెబ్బ అధ్యక్షులు పెందోర్ దాదిరావ్ పేర్కొన్నారు. శు క్రవారం నార్నూర్ మండలంలోని కొమరం భీం విగ్రహారం వద్ద స్వర్గీయ తొలి తరం ఉద్యమ నేత సిడం శంభు ఏనిమిదవ వర్ధంతి ను ఉమ్మడి నార్నూర్ గాదిగూడ మండల ప్రజలు భారీ సంఖ్యలో తరిలి వచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పెందోర్ దాదిరావ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పెందోర్ దాదిరావ్ మాట్లాడుతూ ఆదివాసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా,అటవీ హక్కుల ఉద్యమ కెరటంగా నిలిచి ఆదివాసీల చట్టాలను కాపాడటంలో శంభు పటేల్ చేసిన కృషి అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం తన జీవితాంతం పోరాడిన యోధుడికి ఘనంగానివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న ఉదయం 10 గంటలకు సిడాం శంభు పటేల్ వర్ధంతి నిర్వహణ కమిటీ,గోండ్వానా పంచాయితీ రాయ్‌సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సభజరుగుతుందని తెలిపారు. ఈ స్మారక సభకు ఆదివాసీ ప్రజాప్రతినిధులు,అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెస్రం మాణిక్ రావ్ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా ఉప అధ్యక్షులు,ఆత్రం నాగోరావ్ ఆదివాసీ నార్నూర్ మండల సలహాదారులు, మెస్రం మోతిరం తుడుందెబ్బ నార్నూర్ మండల ఉ పాధ్యక్షులు, పూసం రాము ఆదివాసీ జెఏసీ నాయకులు, కుంరం మన్ను తుడుందెబ్బ మండల నాయకులు, ఊర్వత క్రిష్ణ ఆదివాసీ విద్యార్థి సంఘం సోషల్ మీడియా,పెందోర్ శ్రీనివాస్,ఆత్రం విట్టల్ ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కన్నెపల్లి నుండి వెంటనే నీటిని విడుదల చేయాలి

### -కాళేశ్వరం మోటార్లు వెంటనే స్టార్ట్ చేయాలి

### -గోదావరి జలాలను ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలి

### -గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



మర్కుక్ జూలై 17 విజన్ ఆంధ్ర :కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి జలాలను ఎత్తిపోతల ద్వారా రైతులకు అందించేందుకు కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను వెంటనే ప్రారంభించాలని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ప్రారంభించి,గోదావరి జలాలను ఎత్తిపోసి,రైతులకు సాగునీటిని అందించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు రైతుల జీవనాడి అని,రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్,మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త,గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్,నాయకులు దేవి రవీందర్,కొండపాక బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నూనె కుమార్,మర్కుక్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కర్ణాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ పాండు గౌడ్,మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం,మాజీ వైస్ ఎంపీపీ బాల్ రెడ్డి,మండల బి ఆర్ ఎస్ పార్టీ బి సీ సెల్ అధ్యక్షులు మ్యాకల కనకయ్య,మర్కూక్ మండల సర్పంచ్ ల పోరం అధ్యక్షులు తుమ్మల కనకయ్య,మండల సర్పంచ్ల ఫోరం ప్రధాన కార్యదర్శి కవిత రామ్మోహన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ ల పోరం అధ్యక్షులు కృష్ణ యాదవ్,సర్పంచులు బుల్లె రాణి మల్లేశం,నరిగె సత్తమ్మ రమేష్,భవాని బాలకృష్ణ,బాల్ నర్సయ్య,ఉపసర్పంచ్లు రామ్ రెడ్డి,బొగ్గుల శ్రీకాంత్,సుధాకర్,మాజీ సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు ఆయా గ్రామాల అధ్యక్షులు,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ అన్నాభావూ సాతే వర్ధంతి విజయవంతం చేయాలని గాయక్వాడ్ సాయినాథ్ పిలుపు

తానూర్ :జూలై 17:విజన్ ఆంధ్ర : విప్లవ రచయిత, సాహిత్యరత్న డాక్టర్ అన్నాభావూ సాతే వర్ధంతి కార్యక్రమాన్ని జూలై 18న తానూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు అన్నాభావూ సాతే కమిటీ సభ్యుడు గాయకవాడ్ సాయినాథ్ (ఘురి) తెలిపారు. అణగారిన వర్గాల చైతన్యం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన పేర్కొన్నారు.

మహాత్మా జ్యోతిరావ్ పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలతో సమాజ మార్పు కోసం, శ్రామిక, బహుజన ప్రజల హక్కుల కోసం తన కలంతో పోరాడిన విప్లవ రచయిత, సాహిత్యరత్న డాక్టర్ అన్నాభావూ సాతే వర్ధంతి కార్యక్రమాన్ని జూలై 18న తానూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు అన్నాభావూ సాతే కమిటీ సభ్యుడు గాయకవాడ్ సాయినాథ్ (ఘురి) తెలిపారు.

శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, అణగారిన వర్గాల చైతన్యం కోసం డాక్టర్ అన్నాభావూ సాతే చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ నిర్వహించే వర్ధంతి కార్యక్రమానికి తాలూకా



పరిధిలోని మాదిగ సమాజం, బహుజన బంధువులు, దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మహనీయుడికి ఘన నివాళులు అర్పించాలని గాయకవాడ్ సాయినాథ్ కోరారు.

# పిల్లల మధ్య అంతరం ఉంటేనే కుటుంబాలు ఆరోగ్యం

నిజామాబాద్ జూలై 17:( విజన్ ఆంధ్ర) జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈరోజు నగరంలోని మాలపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ గారు తెలియజేశారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు శ్రీ భుజంగారావు హాజరయ్యి జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ వీధుల గుండా తిరుగుతూ చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం, చోటి పరివార్ సుకీ పరివార్, హమ్ దో హమారే దో, చోటి కాందాన్ కుషాల్ కాన్దాన్ అనే నినాదాలు చేస్తూ జూప్ష్ కి రావడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా వల్ల అనేక అనర్ధాలు ఏర్పడతాయని ముఖ్యంగా వనరులు తరిగిపోయి ,కుటుంబానికి పోషణ భారం పెరిగిపోతుందని, వాతావరణ కాలుష్యం పెరిగుతుందని పరిసరాల పరిశుభ్రత క్షీణిస్తుందని, కుటుంబ నియంత్రణ శాశ్వత మరియు తాత్కాలిక వద్ధతులను అలంబించాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ముందు మానవహారం నిర్వహించే కుటుంబ నియంత్రణపై నినాదాలు చేయడం జరిగింది అన్నారు .అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లోని సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజేష్ గారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు మధ్యన సరియైన అంతరం తోనే కుటుంబాలు ఆరోగ్యంగా మరియు నైపుణ్యంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్క అర్హులైన కుటుంబాలు అమ్మాయి అయినా అబ్బాయి అయినా అందరూ సమానమే అంటూ కుటుంబ నియంత్రణ తాత్కాలిక మరియు శాశ్వత పద్ధతుల పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా తాత్కాలిక పద్ధతులైన పిపిఐయుసిడి, ఐయుసిడి, అంతర ఇంజక్షన్, ఓరల్ పిల్స్, ఈరోజు లాంటివి ఉపయోగించాలన్నారు. అదేవిధంగా శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో భాగంగా ఆడవారికే భారం కాకుండా పురుషుల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కుటుంబ నియంత్రణ మరియు సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు శాలువా, మెమెంటో,ప్రశంస పత్రాలు తో సన్మానించడం జరిగిందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జి జి హెచ్ గైనకాలజిస్ట్ హెచ్ ఓ డి డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ అరుణ రేఖ, డి ఐ ఓ డాక్టర్ అశోక్, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ రవీందర్, డాక్టర్ సికందర్, ఏవో సుమంత్ కుమార్, ఎస్ ఓ రాజేశ్వర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ శిఖరం, డాక్టర్ నవ్య, డిప్యూటీ డెమో దుర్గారావు, డి హెచ్ఈ లు గన్ పూర్ వెంకటేశ్వర్లు, షేక్ సలీం, వైద్యాధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఏఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## వెంచర్ ముందు గీత కార్మికుల బైఠాయింపు

- వెంచర్ అభివృద్ధి పేరుతో తాటి చెట్ల తొలగింపుపై ఆగ్రహం
-జీవనాధారం కోల్పోయిన గీత కార్మికుల బైఠాయింపు
-తొలగించిన తాటి చెట్లకు తక్షణ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్
-ఏఆర్కే వెంచర్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు
-ఎమ్మెల్యే, గౌడ సంఘం నాయకులు స్పందించాలని నిరసనకారుల డిమాండ్
-గీత కార్మికులకు స్థానికుల సంఘీభావం
-తాటి చెట్లు నరికివేతపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఇబ్రహీంపట్నం, జూలై 17 (విజన్ ఆంధ్ర ): రంగారెడ్డి జిల్లా కొంగర కాలన్ లోనీ సర్వే నంబర్లు 85, 86, 87 పరిధిలో ఉన్న తాటి చెట్లను తొలగించడం వల్ల దశాబ్దాలుగా గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఉపాధిని కోల్పోయామని గీత కార్మికులు ఆవేదన వెలిబుచ్చారూ. ఏఆర్కే యాజమాన్యం ఏర్పాటు చేస్తున్న వెంచర్ విల్లాస్ వద్ద శుక్రవారం గీత కార్మికులు టెంటు వేసి బైఠాయించి నిరసన చేపట్టారు. వెంచర్ అభివృద్ధి పేరుతో తాటి చెట్లను తొలగించి తమ జీవనాధారాన్ని దెబ్బతీశారని ఆరోపిస్తూ ఏఆర్కే వెంచర్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని, తొలగించిన తాటి చెట్లకు తగిన నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్రస్థాయి గౌడ సంఘం నాయకులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాటి చెట్లు గీత కార్మికుల జీవనాధారమని, వాటిని తొలగించడం వల్ల అనేక కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయని నిరసనకారులు పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి, బాధిత గీత కార్మికులకు నష్టపరిహారం అందించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని గీత కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు నీళ్ల సురేష్ గౌడ్ ,ఉపాధ్యక్షుడు నీళ్ల ధనరాజ్ గౌడ్, ఉడుతలు అరవింద్ గౌడ్ , కార్యదర్శి చింతకుల శ్రీనివాస్ గౌడ్ ,
నాయిని బాలరాజు గౌడ్ , ప్రేమ కుమార్ , ప్రశాంత్, రమేష్ గౌడ్, రాఘువేందర్ గౌడ్, గుండ్లపవన్ కుమార్, సుమన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# బాసర ఆలయానికి నూతనంగా ఎంపికైన అర్చక బృందానికి నియామక పత్రాలు అందజేత

బాసర :జూలై 17:విజన్ ఆంధ్ర : నిర్మల్ జిల్లా :బాసర భారతదేశంలో పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ క్షేత్రంలో నూతనంగా ఆలయంలో అర్చక బృందం నియామకం కావడంతో, ఈ సందర్భంగా హైదరాబాద్ మహానగరంలోని రవీంద్ర భారతి నిలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, కమిషనర్ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు నిముకులైన అర్చక బృందానికి నియామక పత్రాలను అందజేయగా అదే విధంగా, ఆలయ కార్య నిర్వహణ అధికారిని అంజనాదేవి, తో పాటు ఏఈఓ గంగ శ్రీనివాస్ నియామక పత్రాలను చూసి పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ నుండి వేద పండితులకు పరీక్షలు వ్రాయగా ఈ విధంగా అర్చకులుగా శృతి మురళి శర్మ, మహా విద్య పారాయణ దారుడు, అంకుష్ శర్మ, పరిచరకుడుగా, గోవింద శర్మ, కళాధర్ శర్మ, కిషోర్ పాటక్, శ్రీనివాస్ శర్మ, తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకోగా నేరుగా ఆలయంలో వీరికి నియామక పత్రాలు చూసి ఘన సన్మానం చేపట్టారు. ఆలయ అధికారిని అంజనాదేవి మాట్లాడుతూ...ఈ సందర్భంగా గత కొన్ని సంవత్సరాల నుండి కొందరు వేద పండితులు అర్చకులు పదవి విరమణ పొందిన ఆ స్థానంలో ఖాళీగా ఉన్న వారిని నియమించడం జరిగిందని ఇక నుండి నూతనంగా ఎంపికైన ఆలయానికి అర్చక సిబ్బంది నిత్యం అమ్మవారికి పూజలతో పాటు విధి నిర్వహణలో నియమ నిబంధన పాటించాలని తెలిపారు. అదే విధంగా అమ్మవారి అలంకరణ అభిషేకం పూజ సమయంలో కొందరు తమ వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టి వెళ్లడంతో అప్పుడు కొంతమేర అంతరం కలిగేది ఇప్పుడు అన్ని శ్రావ్యంగా జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శైలేష్ కుమార్ అర్చకులు ప్రవీణ్ తదితరులు ఉన్నారు

# కాంగ్రెస్...కమీషన్‌ల సర్కారు

**- ఫీజు రియంబర్స్మెంట్ ఇచ్చేవరకు పోరాటం...**
**- ఇందూరు రణభేరిలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...**

నిజామాబాద్ జులై 17:( విజన్ ఆంధ్ర( రాష్ట్రంలో కమీషన్ ల సర్కారు కొనసాగుతుందని, ప్రతి పనిలో పర్సంటేజీలు తీసుకుంటున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకై బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ధర్నాచౌక్ లో ఇందూరు రణభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంలో ఫీజు రియంబర్స్మెంట్ పథకం ఎంతో కీలకమైందన్నారు. ఇలాంటి పథకానికి రేవంత్ రెడ్డి సర్కారు తూట్లు పొడుస్తూ రద్దు చేసే దిశగా కుట్రలు పన్నుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.12 వేల కోట్లు బకాయిలు ఉన్నా..స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ అవినీతి విధానాల వల్ల రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం గందరగోళంగా మారిందన్నారు. బడుగు బలహీన వర్గాలను శాశ్వతంగా అణచివేసే కుట్ర ఫీజు రియంబర్స్మెంట్ను నిర్వీర్యం చేసి నోటికాడి ముద్దను లాక్కోవడమేనన్నారు. రాష్ట్రంలో మూడు ట్రిలియన్




అభివృద్ధి వనుల పేర్లు చెప్పే రేవంత్ రెడ్డి విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఎందుకు చెల్లించలేకపోతున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల హక్కుల కోసం బిజెపి పోరాటం ఎన్నటికీ ఆగదని, మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే ఫీజు రియంబర్స్మెంట్ లో కూడా 40 శాతం కమిషన్లను కోరడమంటే ఇంతకన్నా పనికిమాలిన ప్రభుత్వం మరోకటి లేదన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు, విద్యార్థులకు అనేక హామీలిచ్చి తుంగలో తొక్కారని ఆరోపించారు. గత సంవత్సరం నవంబర్లో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బందుకు పిలుపునిస్తే కేవలం కంటితుడుపుగా 200 కోట్లు విడుదల చేసిందన్నారు. ఒక్క ఇందూరు జిల్లాలోనే సుమారు 300 కోట్ల నుంచి 400 కోట్లు బకాయిలు ఉందని గుర్తు చేశారు. ఇందూరు జిల్లా నుంచి మొదలైన రణభేరి రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందని హెచ్చరించారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు,పుస్తకాలు పంపిణీ

**- మాజీ ఎంపీపీ కాశీనాథ్**

అందోల్ జూలై 17 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని చేవెళ్ల గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో మాజీ ఎంపీపీ కాశీనాథ్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా తనవంతుగా పుస్తకాలు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లి దండ్రులకు గ్రామానికి సమాజంలో మంచి పేరు తీసుకురావాలనీ ఆకాక్షించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మచ్చేందర్,పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు అనురాధ, ఉప సర్పంచ్‌హా వడ్ల నాగప్ప , గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంతప్ప , యూత్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరి భూముల రీ సర్వే

## --- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

అందోల్ జూలై 17 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) పక్కగా ప్రతి ఒక్కరి భూముల రీ సర్వే చేయాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు.మెదక్ జిల్లా అల్లాదుర్గంలో శ్రీ వెంకటేశ్వర ఆలయం లో శుక్రవారం నిర్వహించిన భూముల రీసర్వే గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. భూ సమస్యలు తలెత్తకుండా ,ప్రతి రైతుకు భూ హక్కులు కల్పించేలా భూమి రీ సర్వే చేయాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు.రైతులకు భూ వివాదాలు లేకుండా చేసి , ప్రతి భూ కమతానికి భూధార్ అందిస్తామన్నారు.హా భూ పటాలను ప్రక్షాళన చేయాలన్నారు.హా
పక్కగా భూ రీ సర్వే చేసి హద్దులను నిర్ణయించేందు కే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం టేక్మాల్ మండలంలోహా విలేజ్ బౌండరీ సంబంధిత తహసీల్దార్ తో కలిసి మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు వివాదాలకు తావు లేకుండా రైతులకు మేలు చేకూరే విధంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ఈ కార్యక్రమం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,స్థానిక తహసిల్దార్, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# "పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**- సుస్థిర భవిష్యత్తును నిర్మిద్దాం."**

**-- ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య**


**సత్యశోధక్ పాఠశాలలో పర్యావరణ**

**- పరిరక్షణ ప్రతిజ్ఞ**



నిజామాబాద్ జూలై17:( విజన్ ఆంధ్ర ) నేడు సత్యశోధక్ పాఠశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రకృతిని పరిరక్షించడం, నీరు, విద్యుత్ వంటి సహజ వనరులను పొదుపుగా వినియోగించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలను నాటి సంరక్షించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పర్యావరణ హిత జీవన విధానాన్ని అలవర్చుకోవడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. చిన్న చిన్న అలవాట్లలో మార్పు తీసుకురావడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన ఇంటి నుంచే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ప్రారంభించాలని, నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులని, పర్యావరణాన్ని పరిరక్షించి, భావితరాలకు సుస్థిర భవిష్యత్తును నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ నేటి నుంచే పర్యావరణ హిత జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ పట్ల తమ అంకితభావాన్ని చాటిచెప్పారు.

# బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా పి. దళి నాయుడు బాధ్యతల స్వీకారం




బాచుపల్లి, జూలై 17 (విజన్ ఆంధ్ర): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా పి. దళి నాయుడు శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయంలో రికార్డులపై సంతకం చేసి విధులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టం అందరికీ సమానమనే సూత్రంతో పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, నేరాల నియంత్రణ, మహిళల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు పోలీస్ స్టేషన్‌ను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా చర్యలు చేపడతామని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా పనిచేస్తామని చెప్పారు. యువతలో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బాచుపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది నూతన ఇన్‌స్పెక్టర్ పి. దళి నాయుడికి శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఓటర్ల జాబితా సవరణను సమిష్టిగా విజయవంతం చేయాలి:

## దేవర సమత వెంకటరెడ్డి

చేవెళ్ల, జూలై 17 (విజన్ ఆంధ్ర): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా ఎస్ఐఆర్ – ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో విజయవంతం చేయాలని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతవెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం పురపాలక కార్యాలయంలో కమిషనర్ బి. యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రతి వార్డులో అర్హుల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ బి. యాదగిరి ఎస్ఐఆర్ ప్రక్రియ విధానాన్ని వివరించి, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, కల్యాణి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింలు, పెద్దోళ్ల దయాకర్, ముదవత్ కృష్ణ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మీనాక్షి, మాధవి, మంగమ్మ, నాయకులు దేవర వెంకటరెడ్డి, ఆగిరెడ్డి అనంతరెడ్డి, మంగలి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ మేనేజర్లు ఉమేందర్ సింగ్, వెంకటేష్, నరేందర్, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహానంది అవార్డు అందుకున్న రుద్రారం గ్రామవాసి మురళి



చిన్నశంకరంపేట, జూలై17, (విజన్ ఆంధ్ర ) ప్రతినిధి: చిన్న శంకరంపేట మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ఉషన్న గళ్ళ మురళి మాదిగ తను చేసిన సోషల్ వర్క్ మరియు ఎమ్మార్పీఎస్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ సమాజానికి సేవలు అందించడానికి గుర్తించిన జన సాహితీ అకాడమీ జై తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ సంస్థ వారు శుక్రవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య చేతుల మీదుగా మహానంది అవార్డు ఇవ్వడం జరిగింది. అనంతరం మురళి మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం ద్వారా మరింత బాధ్యత పెరిగిందని ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇందుకు సహకరించిన తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ సంస్థ చైర్మన్ డాక్టర్ పాముల రమణ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రావడం పట్ల మండలంలోని సర్పంచులు రాజకీయ నాయకులు ఇతర సంఘాల నాయకులు మురళికి అభినందనలు తెలిపారు.

# ఆరుట్ల టీపీఎస్‌కు నేడు మంత్రి అజారుద్దీన్

## –విద్యార్థులతో క్రికెట్.. పాఠశాల మౌలిక వసతుల పరిశీలన

ఇబ్రహీంపట్నం,జూలై 17 (విజన్ ఆంధ్ర ): రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ శనివారం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)ను సందర్శించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాఠశాలలో గడపనున్న ఆయన విద్యార్థులతో మమేకమవుతూ పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సందర్శనలో భాగంగా విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యే మంత్రి అజారుద్దీన్, క్రీడల్లో రాణించేందుకు అవసరమైన క్రమశిక్షణ, ఫిట్‌నెస్, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలపై సూచనలు చేయనున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి వారిలో క్రీడా స్ఫూర్తిని నింపనున్నారు. మాజీ భారత జట్టు కెప్టెన్‌తో కలిసి మైదానంలో ఆడే అరుదైన అవకాశం టీపీఎస్ విద్యార్థులకు దక్కనుంది.
అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, డైనింగ్ హాల్, హాస్టల్, క్రీడా మైదానాలు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, క్రీడా సామగ్రి, ఇతర మౌలిక వసతులను మంత్రి స్వయంగా పరిశీలించనున్నారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై నేరుగా ఆరా తీసి, అవసరమైన మెరుగుదలలపై అధికారులకు సూచనలు చేయనున్నట్లు సమాచారం.
విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, క్రీడలపై ఆసక్తి, కెరీర్ అవకాశాల గురించి చర్చించి ప్రోత్సాహక సూచనలు చేయనున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని విద్యార్థులకు ప్రేరణనివ్వనున్నట్లు అధికారులు తెలిపారు.
మాజీ భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా విశేష సేవలందించిన అజారుద్దీన్, ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పాఠశాలలను సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. మంత్రి పర్యటనకు సంబంధించి టీపీఎస్ యాజమాన్యం, జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# ఆరోపణలలో నిజం లేదు

## - పూల విజయ్ కుమార్

అనంతపురం జులై 17 ( విజన్ ఆంధ్ర ): తాను విధులు చేపట్టిన ప్రాంతంలో అక్రమాలు జరిగాయాని కొందరు చేసిన ఆరోపణలలో ఎంత మాత్రం నిజం లేదని కేవలం అనవసరంగా లేని పోనీ ఆరోపణలు చేసి ఇబ్బంది పెట్టాలనే కుట్ర తప్ప మరేమి లేదని ఓ గిరిజన సేవగడ్ సంక్షేమ శాఖ లో ప్రిన్సిపాల్ గా పనిచేసిన పూల విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తాను విధుల పట్ల నిబద్ధతతో నిక్కచ్చిగా వ్యవహారిస్తూ నిజాయితీ గా పనిచేయడం వల్లనే ఈ రకంగా కొందరు తమపై బురదజల్లుతున్నారని అక్రమాలను నిరూపిస్తే దేనికయినా సిద్ధంగా ఉన్నామని అన్నారు. గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాష్ట్రా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం జరిగిందని ఇది నిజాయితీకి నిబద్దతకు వరించిన అవార్డు అని విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆరోపణలు చేస్తున్నవారు వారికీ కావాల్సింది ఇవ్వలేదని తమ పై కక్షకట్టి ఆరోపణలు చేస్తున్నారని ఇది చాలా బాధాకరమని అయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఈ మధ్యనే పదవి విరమణ చేయడం జరిగిందని తాము పని చేస్తున్న సమయంలో పాఠశాల కు వచ్చింటే వారికీ కావాల్సిన వివరాలను ఇచ్చేవారమని తాను పదవిలో లేనప్పుడు స్కూల్ కు వెళ్లి అవినీతి మరకలను అంటించడం ఎంత వరకు సమంజసమో ఆరోపణదారులు సమాధానం చెప్పాలని లేనిపక్షంలో న్యాయ బద్ధంగా ఆరోపణలను ఎదుర్కొంటామని మాజీ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ స్పష్టం చేశారు.

# రాష్ట్ర క్రీడా అకాడమీల ప్రవేశాలకు నోటిఫికేషన్

జూలై 20 నుంచి 28 వరకు ప్రతిభా ఎంపికలు ప్రారంభం
ప్రతిభావంతులైన బాలబాలికలకు సువర్ణావకాశం
2026--27 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా ఎంపికల షెడ్యూల్ విడుదల
వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రవేశావకాశం
బాలురు, బాలికలకు వేర్వేరు కేంద్రాల్లో ఎంపిక పరీక్షలు
వయోపరిమితి ప్రకారం క్రీడాకారులకు అవకాశం
ఉచిత శిక్షణ, వసతి, విద్యా సౌకర్యాలు అందజేత
అసలు ధ్రువపత్రాలతో నిర్ణీత తేదీల్లో హాజరు కావాలని అధికారుల సూచన

కుత్బుల్లాపూర్, జూలై 17 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి రాష్ట్ర క్రీడా అకాడమీలు, ప్రాంతీయ క్రీడా వసతి గృహాల్లో ప్రవేశాల కోసం ప్రతిభా ఎంపికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్రంలోని వివిధ కేంద్రాల్లో ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులు ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచే బాలబాలికలను గుర్తించి అత్యున్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ఎంపికలను చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నాణ్యమైన శిక్షణతో పాటు ఉచిత వసతి, పోషకాహారం, విద్యా సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. సైక్లింగ్, రెజ్లింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, హాకీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ తదితర క్రీడాంశాల్లో ప్రతిభా పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా క్రీడలకు సంబంధించి హైదరాబాద్, హనుమకొండ, నిజామాబాద్, ములుగు, మహబూబ్‌నగర్, సూర్యాపేట, గచ్చిబౌలి, ఎన్టీఆర్ స్టేడియం తదితర కేంద్రాలను ఎంపిక కేంద్రాలుగా నిర్ణయించారు. జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ క్రీడలకు 10 నుంచి 12 సంవత్సరాల మధ్య వయస్సు, అథ్లెటిక్స్, వాలీబాల్, హాకీ, కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, రెజ్లింగ్, సైక్లింగ్ క్రీడలకు 14 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు, సూర్యాపేట వాలీబాల్ అకాడమీకి 16 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని అధికారులు తెలిపారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు పాఠశాల లేదా కళాశాల బోనాఫైడ్ ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మార్కుల మెమో, ఆధార్ కార్డు, పది పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు మరియు ఇతర అవసరమైన ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు.

నిర్ణీత తేదీల్లో హాజరు కావాలి

ప్రతి క్రీడకు వేర్వేరు తేదీలు, కేంద్రాలు నిర్ణయించినందున అభ్యర్థులు సంబంధిత షెడ్యూల్‌ను పరిశీలించి నిర్ణీత సమయానికి హాజరు కావాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులు కోరారు. పూర్తి వివరాల కోసం జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

# మూసాపేట డిప్యూటీ కమిషనర్‌కు ఓసి సంఘం ఘన సన్మానం



కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జూలై 17: మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలందిస్తున్నందుకు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సహకారంతో నగరాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ మున్సిపల్ సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఓసి సంఘం నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి మీ ప్రాణాలను రక్షించుకోండి

## - హోప్ న్యూరో డాక్టర్ కృష్ణమూర్తి

-రేగోడ్ విలేకరులకు ఓ పోలీస్ సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ

మెదక్/రేగోడ్ జూలై 17(విజన్ ఆంధ్ర ) : రేగోడు మండలంలో పనిచేస్తున్న విలేకరులకు ఓ పోలీస్ సిబ్బందికి సంగారెడ్డిలోని ప్రముఖ హోప్ న్యూరో ఓ కార్డియాక్ మల్టీ స్పెషల్ ఆసుపత్రి యం.డి డాక్టర్ కృష్ణమూర్తి,రేగోడ్ తహసీల్దార్ దత్తు రెడ్డి,ఎస్సై పోచయ్య చేతుల మీదుగా శుక్రవారం పత్రిక విలేకరులకు, పోలీస్ సిబ్బందికి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలు కావడంతో చాలామంది మరణించడం జరుగుతుందని ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ అనేది మన ప్రాణానికి రక్షణగా ఉంటుందని అన్నారు. రేగోడు తాసిల్దార్ దత్తు శ్రీరెడ్డి మాట్లాడుతూ హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని ప్రతి ఒక్కరు సేవాదృపదంతో ముందుకు సాగాలని సమాజంలో విలేకరుల పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. ఎస్సై పోచయ్య మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేయాలని అన్నారు. ప్రయాణించేటప్పుడు ప్రమాదం సంభవిస్తే తలకు గాయాలు కాకుండా మనకు హెల్మెట్ రక్షస్తుందని అన్నారు. పోలీసు వారి



సూచనలు పాటించి వాహనాలు నడపాలని తెలిపారు. మాజీ సర్పంచ్ విజయభాస్కర్ మాట్లాడుతూ వైద్యుడు కృష్ణమూర్తి హెల్మెట్లను పంపిణీ చేయడం అభినందనీయమని వీరు సంగారెడ్డి జిల్లాలో రెండు వేలకు పైగా హెల్మెట్లను పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ న్యూరో యాజమాన్యం ఏ.శ్రీనివాస్, పాండు నాయక్, టీ. శ్రీనివాస్ మండల పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# భూధాన్ భూమి బాధితులకు అండగా బండి రమేష్ 800 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలని వినతి పత్రం

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జులై 18: మూసాపేట ఆంజనేయ నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్‌ను కలిసి భూదాన్ భూమి బాధితులు వినతిపత్రం అందజేశారు. సుమారు 17 ఎకరాల భూదాన్ భూమిని కొందరు కబ్జా చేసి హక్కుదారులను బెదిరిస్తున్నారని, హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితుల సమస్యను విన్న బండి రమేష్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమాలు, ఒత్తిళ్లకు ఎవరూ లొంగరాదని, అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని, బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడతానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, ఖలీమ్ ఖాన్, ఫాల్గుణరావు, చంద్రరావు, వాసు, నారాయణ, ఆంజనేయులు, రఘువీర్, మల్లికార్జున్, వాణి, కనకమ్మ వజ్రం తదితరులు, భూదాన్ ల్యాండ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయండి

-అల్వాల్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి
-రోజువారీ లక్ష్యాలను సమర్థవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు దిశానిర్దేశం

కుత్బుల్లాపూర్, జూలై 17 (విజన్ ఆంధ్ర): ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను పూర్తి బాధ్యతతో నిర్వహిస్తూ ప్రతి అర్హ ఓటరికి సేవలు అందించాలని ఆదేశించారు. శుక్రవారం అల్వాల్ మండలంలోని 9వ నంబర్ పోలింగ్ స్టేషన్ వద్ద కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలతో మాట్లాడిన ఆయన, ఫారాల పంపిణీతో పాటు పూరించిన దరఖాస్తులను సకాలంలో స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారాలు పూరించే సమయంలో ఓటర్లకు ఎదురయ్యే సందేహాలను వెంటనే నివృత్తి చేస్తూ, వారికి సరైన అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యవంతమైన విధానంలో ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. స్వీకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ఎలా కొనసాగుతోందో కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఇళ్లలో అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సంబంధిత సూపర్వైజర్లకు వెంటనే తెలియజేయాలని బీఎల్‌వోలకు సూచించారు. రోజువారీ లక్ష్యాలను సమయానికి పూర్తి చేస్తూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సలహాలు, మార్గదర్శకాలను అందించారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు.

# హలో నిరుద్యోగి చలో సరూర్నగర్

## కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### - టీఎన్ఎంవిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ నేత



జన్నారం, జులై 17 (విజన్ ఆంధ్ర): హలో నిరుద్యో గి చలో సరూర్నగర్ కార్యక్రమాన్ని లక్షలాది మంది నిరుద్యోగులు విజయవంతం చేయాలని తెలంగా ణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్య క్షుడు, ఎస్ సిటీ చైర్మన్, బీఆర్ ఎస్ పార్టీ యువ నా యకుడు సాయిని ప్రసాద్ నేత పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున జన్నారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రె స్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా నిరు ద్యోగ యువతకు ఒక సంవత్సర కాలంలో రెండుల క్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం దాన్ని తుంగలో తొక్కి నిరు ద్యోగ యువతను మోసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిన విధానా న్ని ఎండగడుతూ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం సరూర్నగర్ స్టేడియంలో ఈ నెల 18న నిరుద్యోగ సంగ్రామ సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్షలాది నిరుద్యోగు లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ మెడలు వంచైన నిరుద్యోగుల పక్షాన పోరాడి న్యాయం చేసే దిశగా భారత రాష్ట్ర సమితి పనిచేస్తుందని ఆయన అన్నారు.

# జన్మదినోత్సవంలో సేవా దృక్పథం

### - చర్ల బీజేపీ మండల అధ్యక్షులు నూప రమేష్

చర్ల, జులై 17 (విజన్ ఆంధ్ర): చర్ల మండల భారతీయ జనతా పార్టీ (భాజపా) అధ్యక్షులు నూప రమేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం మండలంలోని రైస్ పేట రాళ్లగూడెం అంగన్వాడీ కేంద్రంలో ఎంతో ఘనంగా సేవా కార్యక్రమాలతో నిర్వహించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు, సమాజం పట్ల ఆయనకున్న బాధ్యతను చాటిచెప్పాయి

పర్యావరణ హితంగా పుట్టినరోజు

పర్యావరణ పరిరక్షణే మన బాధ్యత అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, నూప రమేష్ రాళ్లగూడెం అంగన్వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశారు,చిన్నారుల కోసం విద్యా సామగ్రి పంపిణీ చేశారు,తన పుట్టినరోజును కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, చిన్నారులకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపట్టడం విశేషం, అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు విద్యాభ్యాసానికి అవసరమైన చదువుల చార్టులు, పలకలు, బలపాలను అందజేశారు, అనంతరం వారికి స్వీట్లు పంపిణీ చేయగా, చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు విరిశాయి

అభినందనలు తెలిపిన నాయకులు

నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, నిరుపేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న నూప రమేష్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పార్టీ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బి. సందీప్, కార్యదర్శి ముత్తవరపు శ్రీనివాస్ చారి, యువమోర్చా నాయకులు పి. వినయ్, అంగన్వాడీ సిబ్బంది, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు



# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలి

### - తాగునీటి, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
### - అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశాలు



రంగారెడ్డి ప్రతినిధి, జులై 17 (విజన్ ఆంధ్ర ) : జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం నుంచి సంబంధిత జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ పలు అభివృద్ధి, ప్రజారోగ్య అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, ప్రీ-ప్రైమరీ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో విద్యార్థుల నమోదును మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. డెంగ్యూ, చికున్గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఆసుపత్రుల్లో మందులు, పరీక్షా కిట్లు, వైద్య సిబ్బంది, అంబులెన్స్ సేవలు, అత్యవసర వైద్య సౌకర్యాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వానాకాల వ్యవసాయ సీజన్ దృష్ట్యా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, రైతు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.కిరణ్మయి, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ అధికారులు, ఎంఈఓలు, ఏఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ ప్రారంభించడం హర్షణీయం

### టీఎన్జీఓ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్




ఇబ్రహీంపట్నం, జులై 17 (విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ ప్రారంభించడం హర్షణీయం అని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు , పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన పారదర్శకమైన క్యాష్ లెస్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం న్యూ ఎంప్లాయిస్ స్కీమును శుక్రవారం ప్రారంభించింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు ఊటు యశ్వంత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఈ పథకం వల్ల ఉద్యోగస్తులకు, పెన్షనర్లకు లబ్ధ చేకూరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ డేటును ఆవిష్కరించారు. అనంతరం న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ పోర్టల్ ను ప్రారంభించి డౌన్లోడ్ చేసుకునే టీచర్ హెల్త్ కార్డులను ఉద్యోగ సంఘాల నాయకులకు అందజేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో మొత్తం 17,88,336 మొంది లబ్ధిదారులకు ఆరోగ్య భద్రత ఉంటుందని తెలిపారు. ఈ హెల్త్ కార్డులో రాష్ట్ర వ్యాప్తంగా 886 ప్రైవేట్ హాస్పిటల్స్ తో పాటు 114 ప్రభుత్వ హాస్పిటల్స్ లో క్యాష్ లెస్ వైద్య సేవలో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు హెల్త్ స్కీమును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం పెద్దపీట వేయడం హర్షణీయం అని వారు పేర్కొన్నారు. వారివెంట టీఎన్జీఓ జిల్లా నాయకులు, తదితరులున్నారు.

# బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..



మరిపెడ , విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బురహాన్ పురం గ్రామంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గిళ్ళ వెంకటమ్మ వెంకన్న, డాక్టర్ కిరణ్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు.పరిసరాల పరిశు భ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.వ్యక్తిగత పరిశు భ్రత తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఇంటి లోపల, బయట పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పగటి పూట కుట్టే దోమ వల్ల డెంగ్యూ జ్వరం వస్తుందని, ఈ దోమ మంచినీటి నిల్వల్లో వృద్ధి చెందుతుందన్నారు. దోమల నియంత్రణతో వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ఇంటి పరిసరాల ప్రాంతాల్లో ఉండే కుండీలు, కూలర్లలో, ఉపయోగంలేని వస్తువుల్లో నీటి నిల్వలను తొలగించాలన్నారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు.

ప్రస్తుత సమాజంలో చాలా మంది బిజీ అయిపోయి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం లేదన్నారు. ఫలితంగా తక్కువ వయసులోనే బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. నిత్యం వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని హితవు పలికారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 150మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాల వికాస సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర, ఏఎన్ఎం లలిత,సహా కో ఆర్డినేటర్లు జుజ్జూరి ఉపేంద్ర, కవిత,ఆశ కార్యకర్తలు వెంకటరమణ,గ్రామ పెద్దలు,గ్రూప్ లీడర్లు ఉమా,గ్రూప్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.